సోమవారం
MONDAY
2-11-2026

సంపుటి ( Volume):2 || సంచిక: (Issue): 124

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):8
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక




# మా టార్గెట్ మోదీ

## అమిత్ షానూ వదలం.. జ్ఞానేశ్‌కు జైలు ఖాయం

### 2024 ఎన్నికలు చెల్లవు.. రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం ఇండియా కూటమి నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. జ్ఞానేశ్‌ను సీఈసీ పదవి నుంచి తొలగిస్తామని.. చివరకు జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంలు, ఓటర్ల జాబితాల అవకతవకల ద్వారా ఓట్ల చోరీ జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలోనే 2024 ఎన్నికల ప్రక్రియనే అక్రమమని అభివర్ణించారు. ఓటు చోరీ అనేది సాధారణ దొంగతనం కాదని.. దేశంలోని ప్రతి పౌరుడి గొంతును దొంగిలించడమేనని అన్నారు. దీన్ని దేశద్రోహంతో పోల్చారు. 2024 ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా, ఓటర్ల జాబితాలను మార్చడం ద్వారా అక్రమాలు జరిగాయని ఆరోపించారు.



న్యూఢిల్లీ:ఎన్నికల తర్వాత 15 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారని.. ఇండియా కూటమి, ఎన్డీయే మధ్య ఓట్ల తేడా 3 శాతమే ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగానే 2024 ఎన్నికలు చట్టబద్ధమైనవి కావంటూ తన వాదనను వినిపించారు. ఈ సభలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన పదవిలో కొనసాగడానికి వీల్లేదని.. భవిష్యత్తులో పదవి నుంచి తొలగించబడతారని అన్నారు. అంతేకాకుండా జైలుకు వెళ్లాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే నరేంద్ర మోదీ ప్రధానమంత్రి, అమిత్ షా కేంద్ర హోంమంత్రి అయ్యేవారు కాదని ఆరోపించారు. దేశంలోని విద్యా వ్యవస్థ నుంచి -2 వ పేజీలో...






# వ్యవసాయ శాఖలో ఖాళీల సాగు!

## డీఏవోల నుంచి ఏఈవోల వరకు పోస్టులు వేకెన్సీ

## 400కు పైగా ఏఈవో పోస్టులు ఖాళీ

### పదవీ విరమణలు, పదోన్నతులతో మరిన్ని!

రైతులకు ప్రభుత్వ పథకాలను చేరవేస్తూ, సాగులో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా కనిపిస్తోంది. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో శాఖ పరిపాలన, క్షేత్రస్థాయి సేవలపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయ అధికారులు (డీఏవోలు), సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏలు), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో) పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదు.

(ఈవార్తలు – ప్రత్యేక కథనం)

రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా ఏఈవో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతుండగా, ఇటీవల పదవీ విరమణలు, పదోన్నతుల కారణంగా రానున్న రోజుల్లో ఖాళీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉద్యోగులపై అదనపు పని భారం పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో అదనపు బాధ్యతల నిర్వహణ అనివార్యంగా మారుతోంది. మండల స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాల్సిన ఏఈవోలు పంటల సాగు సలహాలు, చీడపీడల నివారణ, విత్తనాలు, ఎరువుల వినియోగం, పంటల నమోదు, ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తారు. వీరి కొరతతో రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు అందించడం, క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించడం కష్టతరమయ్యే అవకాశం ఉంది. మరోవైపు డీఏవోలు, ఏడీఏల పోస్టుల ఖాళీలతో పర్యవేక్షణ, సమన్వయ బాధ్యతల నిర్వహణ కూడా సవాలుగా మారుతోంది.

**ఎల్‌నినో.. డిజిటల్ అగ్రికల్చర్..**

**విజన్ 2047 లక్ష్యాలు!**

ఒకవైపు ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొంటూ రైతులకు ముందస్తు సాగు సూచనలు అందించాల్సిన అవసరం ఉంది. మరోవైపు డిజిటల్ అగ్రికల్చర్ ద్వారా వ్యవసాయాన్ని తరువాయి 2 వ పేజీలో...



## హైలో ఓపెన్ విజేతలుగా సింధు, లక్ష్యసేన్

బెర్లిన్: జర్మనీలో జరిగిన హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు, స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ విజేతలుగా నిలిచారు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను సింధు కైవసం చేసుకోగా.. పురుషుల సింగిల్స్ టైటిల్ లక్ష్య సేన్ సొంతం తరువాయి 2 వ పేజీలో...

# ఫోన్ ట్యాపింగ్.. ఏ1 హరీశ్ రావు

## పంజాగుట్ట నుంచి సిద్దిపేటకు కేసు బదిలీ

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదైంది. గతంలో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సిద్దిపేటకు బదిలీ చేయడంతో పోలీసులు కొత్త క్రైమ్ నంబర్‌తో కేసు రిజిస్టర్ చేశారు. అంతేకాకుండా పాత ఎఫ్ఐఆర్‌లో లేని మరో ఆరు సెక్షన్లను అదనంగా చేర్చడం ఈ వ్యవహారంలో ఇప్పుడు తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది.




హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): ఈ కేసు వెనుక ఉన్నది సిద్దిపేటకు చెందిన గాదగోని చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్‌తో పాటు తన భార్య ఫోన్‌ను కూడా అక్రమంగా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. తన కుటుంబ సభ్యుల ఫోన్లపైనా నిఘా పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు 2024 డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో క్రైమ్ నంబర్ 1205/2024 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో ఈ కేసులో హరీశ్‌రావును ఏ1గా.. అప్పటి మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును ఏ2గా పేర్కొన్నారు. తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,888 |
| వెండి (కిలో): | రూ.2,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,361 |

## విశ్వవాణి



క్యాన్సర్ చికిత్సలో శాస్త్రవేత్తలు మరో వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ కణాలను వాటి బయటి పొరను భౌతికంగా దెబ్బతీయడం ద్వారా నాశనం చేసే అతి సూక్ష్మ అణు స్థాయి యంత్రాలను అభివృద్ధి చేశారు. వైద్య చిత్రీకరణలో ఇప్పటికే ఉపయోగిస్తున్న అమినోసయనిన్ అనే కృత్రిమ రంగు అణువులతో వీటిని రూపొందించారు. సమీప పరారుణ కాంతి (నియర్ ఇన్‌ఫ్రారెడ్ లైట్) ప్రసరించినప్పుడు ఈ అణువులు అత్యంత వేగంగా కంపించడం ప్రారంభిస్తాయి. సెకనుకు దాదాపు 40 లక్షల కోట్ల సార్లు కదులుతూ సమన్వయంతో యాంత్రిక కదలికలను సృష్టిస్తాయి. ఈ అణువులు క్యాన్సర్ కణాల చుట్టూ ఉండే కొవ్వు పొరను అంటిపెట్టుకుంటాయి. సమీప పరారుణ కాంతి తగిలినప్పుడు వాటి సమన్వయ కంపనాలు బలమైన యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేసి కణ పొరను చీల్చివేస్తాయి. సాధారణ చికిత్సల్లో రసాయన చర్యల ద్వారా కణాలను చంపుతుండగా, ఈ విధానంలో సూక్ష్మ సుత్తుల్లా పదేపదే కణ పొరపై దాడి చేసి దానిని విచ్ఛిన్నం చేస్తాయి. కనిపించే కాంతితో పోలిస్తే సమీప పరారుణ కాంతి శరీర కణజాలంలోకి మరింత లోతుగా చొచ్చుకెళ్లగలగడం మరో ప్రత్యేకత.



# రేవంత్‌కు బెల్ట్ ట్రీట్మెంట్ ఇయ్యాలె

## ఆదిలాబాద్ సభలో కేటీఆర్ ధ్వజం

తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

ఆదిలాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు సంబంధించిన మరో విడతను కలిపి మొత్తం ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా డైట్ మైదానంలో -2 వ పేజీలో...

# 20 కోట్లను తొలగించే కుట్ర

## మోదీని గద్దె దించుతాం.. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం



దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలకు పాల్పడుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 20 కోట్ల ఓట్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నిర్వహించిన 'ఓటు బచావో... దేశ్ బచావో' మహా ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్‌కు తెలంగాణ భవన్‌లో వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు నీరాజనాలు పలికాయి.

న్యూఢిల్లీ: తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "కులాలు, మతాల పేరుతో దేశ ప్రజలను విభజించి మోదీ రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రాజ్యాంగాన్ని మార్చేసి, రిజర్వేషన్లు రద్దు చేసి, దళితులు, ఆదివాసీలు, మహిళల ఓట్లను తొలగించాలని భావించారు. కానీ ప్రజలు ఆ సంఖ్యాబలాన్ని ఇవ్వకపోవడంతోనే ఇప్పుడు పేదలపై కక్షగట్టి అడ్డదారుల్లో ఓట్లను తొలగిస్తున్నారు" అని ఆరోపించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ దేశ పౌరులందరికీ కల్పించిన ఓటు హక్కును హరించేందుకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కేంద్రం పావుగా వాడుకుంటోందని రేవంత్ ధ్వజమెత్తారు. ఇప్పటికే దేశంలో 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, మొత్తం ఓటర్లలో 15 నుంచి 20 శాతం అంటే దాదాపు 20 కోట్ల ఓట్లను ఎలక్షన్ కమిషన్ ద్వారా గల్లంతు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని హెచ్చరించారు. ప్రయోగాత్మకంగా ఓట్లను తొలగించే కుట్రలతోనే తరువాయి 2 వ పేజీలో...

# కమర్షియల్ సిలిండర్ ధర రూ.10పెంపు



న్యూఢిల్లీ: అక్టోబర్ 1న 19 కిలోల సిలిండర్‌పై ధరను రూ.62.50 మేర పెంచారు. అంతకుముందు నెల సెప్టెంబర్ 1న ధర రూ. 9.50 పెరిగింది. సెప్టెంబర్ నెలకు ముందు జూలైలో రూ. 183.50 , ఆగస్టులో రూ. 192 చొప్పున వరుసగా రెండు నెలల పాటు ఎల్‌పీజీ కమర్షియల్ సిలిండర్ ధరలను తగ్గించారు. అంతర్జాతీయ ఇంధన సరఫరాలో అంతరాయాలు , అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడం వల్ల జూన్‌లో వాణిజ్య ఎల్‌పీజీ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి; ఆ తర్వాతే ఈ ధరల తగ్గింపులు జరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి , జూన్ మధ్య, 19-కేజీల సిలిండర్ తరువాయి 2 వ పేజీలో...




# జీఎస్టీ వసూళ్లు... 2.31 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు అక్టోబర్ నెలలో భారీగా పెరిగాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే ఈసారి ఏకంగా 22.9 శాతం వృద్ధి నమోదైంది. దీంతో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.2.31 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశీయ అమ్మకాలు, దిగుమతుల ద్వారా వచ్చిన పన్ను ఆదాయం ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. ఆదివారం విడుదలైన ప్రభుత్వ గణాంకాలు ఈ విషయాన్ని తరువాయి 2 వ పేజీలో...

# యూపీఐ.. లక్ష కోట్ల లావాదేవీలు

2026 అక్టోబర్ నెలలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేజ్ పేమెంట్స్ సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. యావరేజ్ డైలీ ట్రాన్సాక్షన్ వాల్యూ తొలిసారిగా రూ.1 లక్ష కోట్లను దాటి, కొత్త మైలురాయిని నమోదు చేసింది. డిజిటల్ పేమెంట్స్ వేదికగా మొత్తం విలువ ఆ నెలలో రూ.31.53 లక్షల కోట్లకు చేరుకుంది. దీంతో యూపీఐ పేమెంట్స్ తొలిసారిగా రూ. 30 లక్షల కోట్ల మార్కును అధిగమించింది.




న్యూఢిల్లీ: పండుగ సీజన్‌లో వినియోగదారుల వ్యయం పెరగడం ఈ పెరుగుదలకు ప్రాక్షికంగా కారణమైంది. సాధారణంగా పండుగ సీజన్‌లో రిటైల్, ఈ-కామర్స్ , ఇతర విభాగాలలో కొనుగోళ్లు పెరుగుతాయి. మొట్టమొదటి సారిగా యూపీఐ మంత్లీ ట్రాన్సాక్షన్స్ విలువ రూ.30 లక్షల మైల్‌స్టోన్‌ను దాటేసింది. మే 2026 నెలలో రూ.29.9 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. ఆ తర్వాత అక్టోబర్ నెలలో రూ.30 లక్షల విలువైన ట్రాన్సాక్షన్స్ జరిగాయి.

# రాశి ఫలాలు
2.11.2026

**మేషం:** ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి.

**వృషభం:** సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులలో పురోగతి సాధిస్తారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో విశేషమైన ఆధరణ పెరుగుతుంది.

**మిథునం:** కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. నూతన అవకాశాలు అందుకుంటారు. వ్యాపార విస్తరణకు పెట్టుబడులు సమకూరుతాయి. ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. సన్నిహితుల నుండి కొత్త విషయాలు సేకరిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

**కర్కాటకం:** కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు కలసిరావు. చిన్ననాటి మిత్రులతో అకారణ వివాదాలు ఉంటాయి. బంధు వర్గంతో మాట పట్టింపులు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో నిరాశ తప్పదు. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

**సింహం:** ఉద్యోగాలు ఆశించిన రీతిలో రాణించవు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార వ్యవహారాలు మందగిస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి.

**కన్య:** వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలిగి పదోన్నతులు పెరుగుతాయి. నూతన వ్యక్తుల పరిచయాలు భవిష్యత్ కు ఉపయోగపడతాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. సంతానానికి నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

**తుల:** చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. ఉద్యోగాలలో మీ పని తీరుతో అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** బంధు మిత్రులతో ఒక వ్యవహారంలో వివాదాలు తప్పవు. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులుంటాయి. దూరప్రయాణాలు వీలైనంతవరకు వాయిదా వేయడం మంచిది.

**ధనస్సు:** ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. సంతాన విద్యా ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి.

**మకరం:** ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో సొంత నిర్ణయాలతో ముందుకు సాగడం మంచిది. ఆత్మీయుల నుంచి అందిన శుభవార్త ఆనందం కలిగిస్తుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**కుంభం:** ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో సమస్యలు ఉంటాయి. ధన వ్యవహారాలలో ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో ఆకస్మిక నిర్ణయాల వలన నష్టాలు తప్పవు.

**మీనం:** వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఒక వార్త ఊరట కలిగిస్తుంది. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. గృహమున శుభకార్యాల నిర్వహణపై చర్చలు చేస్తారు.

# మా టార్గెట్ మోదీ



**మొదటి పేజీ తరువాయి**

దర్యాప్తు సంస్థల వరకు అనేక రాజ్యాంగ, ప్రభుత్వ సంస్థలపై ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. దీని వల్ల రైతులు, కార్మికులు, యువతకు రావాల్సిన హక్కులు దక్కడం లేదని అన్నారు. డబ్బు, అధికారంతో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ ప్రాధాన్యతను వివరించిన రాహుల్ గాంధీ.. ఎంతటి ఆర్థిక శక్తి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అంతం చేయడానికి తాము అనుమతించబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంతో పాటు మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వాలు కూడా ఓట్ల చోరీ ద్వారానే బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజలు వారిని ఎన్నుకోవడం లేదని.. వారే తమకు తాముగా అధికారాన్ని కట్టబెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మోదీ ప్రధాని పదవి నుంచి దిగిపోతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందని అన్నారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సహా ఇండియా కూటమికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం పనితీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతకుముందు మింటో రోడ్-కనాట్ ప్లేస్ కూడలి నుంచి 'చలో ఢిల్లీ' పేరుతో ర్యాలీ ప్రారంభమై రామ్‌లీలా మైదానానికి చేరుకుంది. అక్టోబర్ 31వ తేదీన సీఈసీకి వ్యతిరేకంగా నిర్వహించిన ప్రతీకాత్మక అభిశంసన కార్యక్రమం తర్వాత ఈ భారీ సభ జరిగింది.

బీజేపీ ఎదురుదాడి..

ఎస్ఐఆర్‌కు మద్దతుగా కేంద్ర మంత్రి

మరోవైపు ఇండియా కూటమి ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం కోల్పోయాయని బీజేపీ నేత ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో.. అరాజకతా హటావో' పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థించారు. ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో దేశంలో భారీగా వలసలు, పట్టణీకరణ జరిగాయని, ఒకే వ్యక్తి పాత నివాస ప్రాంతంతో పాటు కొత్త ప్రాంతంలోనూ ఓటరుగా నమోదయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. గత 20 ఏళ్లలో సుమారు 40 కోట్ల మంది వలస వెళ్లగా.. దాదాపు 20 కోట్ల మంది మరణించారని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ వివిధ దశల్లో సుమారు 13 కోట్ల ఎంట్రీలను తొలగించగా.. అందులో 2.8 కోట్ల మంది మరణించిన వారి పేర్లు ఉన్నాయని.. మరో 1.9 కోట్ల కొత్త పేర్లను చేర్చినట్లు వివరించారు. అనర్హుల పేర్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదుతో ఎన్నికల జాబితాలను ప్రక్షాళన చేయడమే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని చెప్పారు. ఓటర్ల జాబితాల సవరణపై ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా.. ఎన్నికల సంఘం మాత్రం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం లేదని స్పష్టం చేస్తోంది. పొరపాటున పేర్లు తొలగించబడిన ఓటర్లు తిరిగి నమోదు చేసుకోవచ్చని పేర్కొంటోంది. మరోవైపు ఎస్ఐఆర్‌లో పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించడం, ఓటర్ల నమోదు ప్రక్రియలో పారదర్శకతపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. దీంతో దేశంలో ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితాల ప్రక్షాళన, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాలు రాజకీయ చర్చలో కీలకంగా మారాయి.



# హైలో ఓపెన్ విజేతలుగా సింధు, లక్ష్యసేన్

**మొదటి పేజీ తరువాయి**

చేసుకున్నాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న సింధు ఈ టోర్నీలో ఏకపక్ష విజయాలతో దూకుడు ప్రదర్శించింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లోనూ ఆమె డెన్మార్క్‌కు చెందిన లైన్ జేర్స్‌ఫెల్డ్‌ను చిత్తు చేసింది. 39 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సింధు 21-12, 21-14 తేడాతో అలవోకగా గెలిచింది. రెండు గేముల్లోనూ సింధు స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించింది. ఆమె ముందు ప్రత్యర్థి కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో హైలో ఓపెన్ ఉమెన్స్ సింగిల్స్ టైటిల్ గెలిచిన తొలి భారత క్రీడాకారిణిగా సింధు నిలిచింది. ఈ ఏడాది సింధుకు ఇది రెండో టైటిల్. జూలైలో జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్‌లో లక్ష్యసేన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచాడు. హైలో ఓపెన్ గెలవడంతో ఏడాది తర్వాత అతని ఖాతాలో మరో టైటిల్ చేరింది. ఫైనల్‌లో సేన్ సంచలన ప్రదర్శన చేశాడు. తన కంటే మెరుగైన ర్యాంకర్ ఇండోనేషియా ప్లేయర్ జోనాటన్ క్రిస్టీని 21-17, 21-10 తేడాతో మట్టికరిపించాడు. 39 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేములో ప్రత్యర్థి పోటీనిచ్చినా శుభారంభం చేశాడు. ఇక రెండో గేములో సేన్ హవానే నడించింది. హైలో ఓపెన్ గెలవడం సేన్‌కు ఇది రెండోసారి. 2019లో తొలిసారిగా టైటిల్ సాధించాడు.

# 20 కోట్లను తొలగించే కుట్ర

**మొదటి పేజీ తరువాయి**

బీజేపీ ఇప్పటికే బిహార్, మహారాష్ట్రల్లో పాగా వేసిందని.. అదే పంథాను దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తోందని పేర్కొన్నారు. ఢిల్లీ మహా సభకు తెలంగాణ నుంచి సుమారు 15 వేల మంది కార్యకర్తలు తరలివచ్చేలా ప్రత్యేక రైళ్లను బుక్ చేసుకుంటే, ఆఖరి నిమిషం వరకు నమ్మించి రైల్వే శాఖ ద్వారా వాటిని రద్దు చేయించారని సీఎం ఆరోపించారు. "రైళ్లు ఇవ్వకపోయినా కార్యకర్తలు ప్రైవేట్ వాహనాలు, ఇతర మార్గాల్లో వేలాదిగా ఢిల్లీకి తరలివచ్చారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ కలిసి కార్యకర్తల పట్టుదలను అడ్డుకోలేకపోయారు. తెలంగాణ బలం ముందు, తెలంగాణ గళం ముందు కేంద్ర పాలకులు తలవంచక తప్పలేదు" అని రేవంత్ స్పష్టం చేశారు. త్రేతాయుగంలో రావణాసురుడిని ఓడించేందుకు శ్రీరాముడికి వానర సేన ఎలాగైతే తోడ్పడిందో, నేడు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోదీని గద్దె దించేందుకు తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు వానర సైన్యంలా పోరాడతాయని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో విజయం సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని, రాంలీలా మైదాన్ సంకల్పంతో మోదీ సర్కార్ కుప్పకూలి గుజరాత్ బాట పట్టడం ఖాయమని హెచ్చరించారు. తెలంగాణ భవన్ సమావేశం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసానికి వెళ్లారు. అక్కడ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు అఖిలేష్ యాదవ్, మమతా బెనర్జీ, ఫరూఖ్ అబ్దుల్లా, తేజస్వి యాదవ్, మెహబూబా ముఫ్తీ, సంజయ్ రౌత్ వంటి ఇండియా కూటమి అగ్రనేతలతో కలిసి ఓపెన్ టాప్ జీపులో రాంలీలా మైదాన్ మహా సభకు ర్యాలీగా కదిలారు. దారిపొడవునా తెలంగాణ సీఎం రేవంత్‌తో సెల్ఫీలు, కరచాలనం కోసం కాంగ్రెస్ శ్రేణులు ఎగబడ్డాయి.

# ఫోన్ ట్యాపింగ్.. ఏ1 హరీశ్ రావు

**మొదటి పేజీ తరువాయి**



అయితే ఈ కేసు న్యాయపరమైన పరిణామాలను కూడా ఎదుర్కొంది. హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతరం చక్రధర్‌గౌడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ.. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించినట్లు అందుబాటులో ఉన్న సమాచారం చెబుతోంది. తాజాగా ఈ కేసును పంజాగుట్ట పోలీస్ స్టేషన్ నుంచి సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పోలీసులు క్రైమ్ నంబర్ 496/2026తో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పాత కేసులో పేర్కొన్న సెక్షన్లకు అదనంగా ఆరు సెక్షన్లను చేర్చినట్లు సమాచారం. వాటిలో ఐపీసీ 419, 420, 467, 406 సెక్షన్లతో పాటు ఐటీ యాక్ట్ కింద 66సీ, 66డీ సెక్షన్లు ఉన్నాయి. ఈ సెక్షన్లు వ్యక్తిగత గుర్తింపును దుర్వినియోగం చేయడం, మోసం, ఫోర్జరీ, నమ్మకద్రోహం, కంప్యూటర్ సంబంధిత గుర్తింపు దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన అంశాలను కలిగి ఉంటాయి. కొత్త ఎఫ్ఐఆర్‌లోనూ తన్నీరు హరీశ్‌రావు పేరును ఏ1గా, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పేరును ఏ2గా పేర్కొన్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొందరి పేర్లు కూడా నిందితుల జాబితాలో ఉన్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు సిద్దిపేటకు బదిలీ కావడం, కొత్త క్రైమ్ నంబర్‌తో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, అదనపు సెక్షన్లు చేర్చడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా హరీశ్‌రావు పేరు ఏ1గా ఉండటంతో బీఆర్ఎస్ వర్గాల్లో ఈ పరిణామంపై ఆసక్తి నెలకొంది. ఇక ఈ కేసులో తదుపరి పోలీసుల చర్యలు ఎలా ఉండబోతున్నాయన్నది కీలకంగా మారింది. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభిస్తాయి.. ఎవరెవరిని విచారణకు పిలుస్తారు.. న్యాయపరంగా ఈ కేసు ఎలాంటి మలుపులు తీసుకుంటుంది అనే అంశాలపై ఉత్కంఠ నెలకొంది.

# కమర్షియల్ సిలిండర్ ధర రూ.10పెంపు

**మొదటి పేజీ తరువాయి**

వాణిజ్య ఎల్‌పిజి ధరలు రూ. 1,373 మేర పెరిగి, రూ. 1,740.50 నుండి రూ. 3,113.50కి చేరాయి. ఆ తర్వాత జూలై , ఆగస్టు నెలల్లో తగ్గాయి. అంతర్జాతీయ ప్రామాణిక ధరలలోని మార్పులు, రూపాయి-డాలర్ మారకపు రేటుపై ఆధారపడి చమురు ధరల్లో మార్పులు ఉంటాయి. ఏటీఎఫ్ , ఎల్‌పిజి ధరలను ప్రతి నెలా మొదటి తేదీన సవరిస్తారు. వ్యాట్‌తో పాటు ఆయా రాష్ట్రాల్లో వర్తించే టాక్స్ కారణంగా ఈ ధరలు రాష్ట్రాల వారీగా మారవచ్చు. డొమెస్టిక్ ఎల్‌పీజి ధరలు 14.2-కేజీల సిలిండర్‌కు రూ. 942 గా ఉన్నాయి. పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడటం, అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో, మార్చి , జూన్ మధ్య దేశీయ వంటగ్యాస్ ధరలు సిలిండర్‌కు రూ. 89 మేర పెరిగాయి. మే నెలలో లీటరుకు సుమారు రూ. 7.50 చొప్పున పెరిగిన పెట్రోల్ , డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు.

## జీఎస్టీ వసూళ్లు...2.31 లక్షల కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించాయి. అక్టోబర్ నెలలో దేశీయ అమ్మకాల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 15.8 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ మొత్తం సుమారు రూ.1.37 లక్షల కోట్లుగా ఉంది. మరోవైపు దిగుమతులపై విధించే జీఎస్టీ ఆదాయం మరింత భారీగా పెరిగింది. గత ఏడాది అక్టోబర్‌లో రూ.50,796 కోట్లుగా ఉన్న ఈ ఆదాయం.. ఈసారి 42.2 శాతం వృద్ధితో రూ.72,246 కోట్లకు చేరుకుంది. దిగుమతుల ద్వారా వచ్చిన ఆదాయం మొత్తం జీఎస్టీ వసూళ్ల పెరుగుదలలో కీలక పాత్ర పోషించింది. ప్రభుత్వం చెల్లించిన పన్ను వాపసులను మినహాయించిన తర్వాత కూడా జీఎస్టీ ఆదాయంలో గణనీయమైన వృద్ధి నమోదైంది. అక్టోబర్‌లో నికర జీఎస్టీ వసూళ్లు గత ఏడాదితో పోలిస్తే 25.6 శాతం పెరిగి రూ.2.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అక్టోబర్ నెలలో మొత్తం జీఎస్టీ రీఫండ్లు 6.5 శాతం పెరిగి రూ.27,934 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో ఈ మొత్తం రూ.26,225 కోట్లుగా ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు తొలి 7 నెలల్లోనూ జీఎస్టీ వసూళ్లు వృద్ధిని నమోదు చేశాయి.

## రేవంత్‌కు బెల్ట్ ట్రీట్మెంట్ ఇయ్యాలె

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాళేశ్వరం గంగ ప్రవహిస్తోందని, ఈ సమయంలోనూ 15 వేల నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు అందుబాటులో ఉందని కేటీఆర్ తెలిపారు. అవసరమైతే ఇప్పటికీ నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉందని చెప్పారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నీటిని ఎత్తిపోసే ఆలోచన లేదని విమర్శించారు. నీళ్లు ఇస్తే యూరియా ఇవ్వాల్సి వస్తుందని, పంటలు పండితే వాటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని, కొనుగోలు చేస్తే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసుకోవచ్చని రిటైర్డ్ ఇంజినీర్లు ముఖ్యమంత్రికి లేఖ రాశారని కేటీఆర్ పేర్కొన్నారు. నీటిని ఎత్తిపోసే విధానాన్ని చూపిస్తామని కూడా వారు చెప్పారని వివరించారు. అయితే వారి సూచనలను స్వీకరించకుండా ముఖ్యమంత్రి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. వీళ్లకు బెల్ట్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని.. చర్లపల్లి జైల్లో పెట్టాలని అన్నాడని చెప్పారు. వీళ్లను పొట్టు పొట్టు కొట్టేటోడు లేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని చెప్పి అడ్డగోలుగా మాట్లాడడని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజినీర్ల మాట విని జులైలోనే నీటిని ఎత్తిపోసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితులు వచ్చేవి కావని అన్నారు. ఇవాళ కరువు వచ్చింది కదా.. ఎవరికి బెల్ట్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని ప్రశ్నించారు. నీళ్లు ఎత్తిపోయకుండా వ్యవసాయాన్ని ఆగం చేసి, కరువు తెచ్చిన కాంగ్రెస్‌కు బెల్ట్ ట్రీట్‌మెంట్ ఇచ్చే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని చెనాకా-కొరాట ప్రాజెక్టు పనులను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహారాష్ట్రతో ఒప్పందం చేసుకుని దశాబ్దాల కలను సాకారం చేశామని, ప్రాజెక్టు ట్రయల్ రన్ కూడా పూర్తిచేశామని చెప్పారు. అయితే మూడేళ్లు గడిచినా పంపింగ్ కాలువల పనులు పూర్తి చేయలేదని ఆరోపించారు. కాలువలు తవ్వితే ఆదిలాబాద్ రైతులకు సాగునీరు అందుతుందని, ప్రభుత్వం ఈ పనులపై నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలోనూ ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం మూడేళ్లు పట్టిందని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ఇదంతా కేవలం డ్రామా మాత్రమేనని.. ప్రజలను మభ్యపెట్టేందుకే అని అన్నారు.

## వ్యవసాయ శాఖలో ఖాళీల సాగు!

ఆధునికీకరించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన తరుణంలో అధికారుల కొరత ప్రధాన అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. తగినంత సిబ్బంది లేకపోతే ఈ లక్ష్యాల అమలులో జాప్యం జరిగి వ్యవసాయ శాఖ పాలన కుంటుపడే అవకాశం లేకపోలేదు.

ప్రభుత్వం స్పందించేది ఎప్పుడు?

ఇప్పటికే ఉన్న ఖాళీలకు తోడు పదవీ విరమణలు, పదోన్నతులతో మరిన్ని పోస్టులు ఖాళీ కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. డీఏవో, ఏడీఏ, ఏఈవో పోస్టులను ప్రాధాన్యత క్రమంలో భర్తీ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ రంగానికి ఆధునిక సాంకేతికతను జోడించడంతో పాటు, ఆ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు



## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**'నషా ముక్త్ భారత్' సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎంపీ లక్ష్మణ్**

బన్సీలాల్‌పేట్, నవంబర్ 1 (ఈవార్తలు): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల బారినపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ సూచించారు. దేశద్రోహ శక్తుల ఆగడాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగంపై యువతకు అవగాహన కల్పించేందుకు ఆదివారం పద్మారావు నగర్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద 'నషా ముక్త్ భారత్' పేరుతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అక్కడి నుంచి బేగంపేట డివిజన్‌లోని సింధీ కాలనీ రత్నదీప్ సూపర్ మార్కెట్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం యువతతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్ రెడ్డి, మహంకాళిసికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సురేష్ కుమార్, పెద్ది రవీందర్, ఎస్. రాజు, జిల్లా నాయకులు పవన్ పటేల్, సత్యనారాయణ గౌడ్, హరినాథ్ నాయి, కే.ఎం. కృష్ణ, మర్రి పురూరవ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కేతినేని సరళ, కొంతం దీపిక, డివిజన్ అధ్యక్షులు మహేష్, రఘురామ్, జితేందర్, ప్రశాంత్, మీడియా సమన్వయకర్త వై. శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## భీమన్న సేవలో భక్తులు

వేములవాడ అర్బన్, నవంబర్ 1 (ఈవార్తలు): ఆదివారం సెలవు దినం కావడంతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తలనీలాలు సమర్పించడంతో పాటు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అభిషేకం, అన్నపూజ, కుంకుమ పూజ, స్వామివారి కల్యాణం, చండీ హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గండదీపంలో నూనె పోసి భక్తులు తమ మొక్కుబడులను భక్తిశ్రద్ధలతో చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో రమాదేవి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉచిత దర్శనం క్యూలైన్లు, ప్రదక్షిణ మార్గం, కోడెలను కట్టే ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దర్శనానికి వచ్చిన వృద్ధులు, చిన్నారులు, ఇతర భక్తులతో మాట్లాడి దర్శన ఏర్పాట్లు, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. ఆలయ భద్రత విషయంలో ఎస్పీఎఫ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్ పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు కొత్త చైర్మన్‌ను నియమించాలి

**హోళియదాసరి హక్కుల పోరాట సమితి డిమాండ్**

వేములవాడ అర్బన్, నవంబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పదవీకాలం అక్టోబర్ 3తో ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే నూతన కమిషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌తో పాటు సభ్యులను నియమించాలని హోళియదాసరి హక్కుల పోరాట సమితి (హెచ్‌డీహెచ్‌పీఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. నూతన కమిషన్ చైర్మన్‌గా ఉన్నత విద్యావంతులు, చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగిన విశ్రాంత హైకోర్టు లేదా జిల్లా న్యాయమూర్తిని నియమించాలని కోరింది. ఎస్సీ కులాల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, చట్టపరమైన పరిజ్ఞానం, వివిధ రంగాల్లో అనుభవం కలిగినవారికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. కమిషన్ సభ్యుల నియామకంలో ఎస్సీ ఉపకులాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొంది. అన్ని ఉపకులాలకు సమాన న్యాయం జరిగేలా సామాజిక సమస్యలపై అవగాహన, చట్టపరమైన పరిజ్ఞానం ఉన్నవారిని సభ్యులుగా నియమించాలని కోరింది. దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఉద్యమకారులు, దళిత మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేసేలా హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ నెక్లెస్ రోడ్డుపై వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణతో పాటు అన్ని ఎస్సీ ఉపకులాలకు సమాన న్యాయం కల్పించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సమితి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల నరేశ్ హోళియ దాసరి కోరారు.

## ఢిల్లీ ర్యాలీలో దొడ్ల వెంకటేష్

కూకట్‌పల్లి, నవంబర్ 1 (ఈవార్తలు): ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'చలో ఢిల్లీ' ర్యాలీ, బహిరంగ సభలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు.

# ఉద్యమం.. ఉద్యోగం.. మనదే!

**తెలంగాణ ఉద్యమంలో 'నమస్తే తెలంగాణ' జర్నలిస్టుల పాత్ర కీలకం.. 16 ఏళ్ల తర్వాత తొలి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం**



హైదరాబాద్, నవంబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమంలో 'నమస్తే తెలంగాణ' పత్రిక కీలక పాత్ర పోషించిందని, తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టేందుకు చారిత్రక అవసరంగా ఆ పత్రిక ఆవిర్భవించిందని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, నమస్తే తెలంగాణ మాజీ ఎడిటర్ అల్లం నారాయణ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ అతిథి గృహంలో 16 ఏళ్ల తర్వాత నమస్తే తెలంగాణ తొలి బ్యాచ్ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. అప్పట్లో ఆంధ్రా ఆధిపత్యంలో పత్రికలు నడుస్తున్న పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఉద్యమంలోని ప్రతి అంశంలోనూ ప్రజల కోణాన్ని ఆవిష్కరించామని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు సాగిన తెలంగాణ ఉద్యమాన్ని విస్తృతంగా కవర్ చేశామని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల పాత్ర అనిర్వచనీయమని పేర్కొన్నారు. తెలంగాణ వాళ్లకు మీడియాను నడపడం చేతకాదని అవమానించిన సమాజానికి తమ పనితీరుతో సమాధానం చెప్పామన్నారు. ఉద్యమంలో పత్రిక అవసరాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించారని, ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ పత్రికను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ప్రతి వర్గానికి నాటి నమస్తే తెలంగాణ అవసరమైన వేదికగా మారిందన్నారు. నమస్తే తెలంగాణ మాజీ ఎడిటర్, ప్రభాత ఉదయం ఎడిటర్ కట్టా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజంలో నేర్చుకున్న నైపుణ్యాలు ఎక్కడ పనిచేసినా ఉపయోగపడతాయని అన్నారు. నమస్తే తెలంగాణ ఆవిర్భావానికి ముందే శిక్షణ పొందిన జర్నలిస్టులు తెలంగాణ భావజాల వ్యాప్తికి కృషి చేశారని గుర్తుచేశారు. 16 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నామని, వేతనాలు తక్కువగా ఉన్నప్పటికీ ఉద్యమం కోసం పనిచేశామన్న సంతృప్తి ఉందన్నారు. తొలి బ్యాచ్‌లో శిక్షణ పొందినవారు నేడు వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ఇన్నేళ్ల తర్వాత అందరూ ఒకచోట కలవడం ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసిందన్నారు. దిశ ఎడిటర్ డి. మార్కండేయ మాట్లాడుతూ.. నమస్తే తెలంగాణ మీడియా రంగంలో సంచలనంగా నిలిచిందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. తొలి నుంచి పనిచేసిన జర్నలిస్టులు అనేక సవాళ్లను ఎదుర్కొని నిలబడ్డారని గుర్తుచేశారు. సమావేశంలో ఎస్ చిరంజీవి ప్రసాద్, సరస్వతి రమ, భాను ప్రసాద్, డీ రవీందర్, మహేందర్ రెడ్డి, అజయ్, సత్యప్రసాద్, పుట్టా రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత పౌరులదే

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు**



వేములవాడ అర్బన్, నవంబర్ 1 (ఈవార్తలు): ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు అన్నారు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు మారడం సహజమని, దేశం, ప్రజాస్వామ్య వ్యవస్థలు మాత్రం శాశ్వతంగా నిలవాలని పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని మహాదేవ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పౌరులు, మేధావులతో నిర్వహించిన 'డైలాగ్ విత్ ఎమినెంట్ సిటిజన్స్' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతం, విలువల పరిరక్షణలో పౌరుల పాత్ర, సమకాలీన రాజకీయ పరిణామాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. భారతదేశానికి ప్రజాస్వామ్య సంప్రదాయం కొత్తదేమీ కాదని వికాస్ రావు అన్నారు. ప్రాచీన కాలంలోనే ప్రజలు చర్చించి సమష్టిగా నిర్ణయాలు తీసుకునే పద్ధతులు ఉండేవని పేర్కొన్నారు. రుగ్వేద కాలంలోని 'సభ', 'సమితి' వ్యవస్థలు ప్రజాభిప్రాయాల చర్చకు, ఉమ్మడి నిర్ణయాలకు వేదికలుగా ఉండేవని గుర్తుచేశారు. అనంతరం గ్రామ పంచాయతీలు, బుద్ధుని కాలంలోని గ్రామ సంఘాల ద్వారా ఈ సంప్రదాయం కొనసాగిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను గుర్తుచేశారు. మారుతున్న కాలం, అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగ సవరణలు చేసుకునే అవకాశం కల్పించారని, ఇప్పటివరకు 106 రాజ్యాంగ సవరణ చట్టాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చట్టబద్ధమైనదేనని వికాస్ రావు పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 324వ అధికరణం, ప్రజాప్రాతినిధ్య చట్టం1950లోని 21(3) సెక్షన్ ప్రకారం ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా సవరించే అధికారం ఎన్నికల సంఘానికి ఉందన్నారు. గతంలోనూ దేశంలో ఎనిమిదిసార్లు ఈ తరహా సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, నివాసం మారిన వారి వివరాలను సవరించడం, నకిలీ, ద్వంద్వ ఓట్లను తొలగించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ ప్రక్రియపై సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే బూత్ స్థాయి అధికారులు, ఓటరు నమోదు అధికారులను సంప్రదించి చట్టబద్ధమైన విధానంలో పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపి, మోహన్ రెడ్డితో పాటు స్థానిక మేధావులు, నేటి ఈవార్తలు స్టాఫ్ రిపోర్టర్ కోయల్ కార్ మహేష్, న్యాయవాదులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పలువురు పౌరులు పాల్గొన్నారు.




## దూసుకొస్తున్న 'మురసు' తుపాను

ఒంగోలు, నవంబర్ 1 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తుపాను వేగంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం నైరుతి, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుపాను, రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. నవంబర్ 2వ తేదీ రాత్రి సమయంలో దక్షిణ కోస్తాంధ్రలోని నెల్లూరు, నర్సాపురం మధ్య, ఒంగోలుకు సమీపంలో ఇది తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 120 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపింది. భారత వాతావరణ శాఖ ఆదివారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, 'మురసు' తుపాను గత ఆరు గంటల్లో గంటకు 25 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా పయనించింది. ప్రస్తుతం ఇది చెన్నైకి ఆగ్నేయంగా 420 కిలోమీటర్లు, నెల్లూరుకు ఆగ్నేయంగా 490 కిలోమీటర్లు, మచిలీపట్నానికి ఆగ్నేయంగా 500 కిలోమీటర్లు, కావలికి తూర్పు ఆగ్నేయంగా 510 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం రాత్రి నాటికి ఇది మరింత బలపడి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఆ తర్వాత వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 2న సాయంత్రం లేదా రాత్రి వేళకు ఆంధ్రప్రదేశ్ తీరాన్ని సమీపిస్తుంది. తుఫాను తీరం దాటే సమయంలో దాని ప్రభావం దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా బాపట్ల, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రపు అలలు సాధారణం కంటే 1 నుంచి 1.5 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడే అవకాశం (స్టార్మ్ సర్జ్) ఉందని, దీనివల్ల తీర ప్రాంతాలు జలమయం కావచ్చని అప్రమత్తం చేసింది. ఈ నాలుగు జిల్లాల్లో సముద్రపు పోటు ప్రభావం గరిష్ఠంగా ఉంటుందని ప్రత్యేకంగా పేర్కొంది. తుపాను ప్రభావంతో కోస్తాంధ్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## రాప్తాడు నిందితుడిపై పోలీసుల కాల్పులు

ఆత్మకూరు, నవంబర్ 1 (ఈవార్తలు): ఏపీలో సంచలనం సృష్టించిన రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతను పోలీసులపై రాళ్లతో దాడికి యత్నించాడు. దీంతో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్టు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థినిపై ఆమె బంధువైన హేమంత్ దారుణంగా దాడి చేసిన విషయం తెలిసిందే. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదిలోకి ఎలక్ట్రిక్ రంపంతో (చైన్‌సా) ప్రవేశించిన హేమంత్.. బాలిక తల, ముఖం, వీపు భాగాలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కాళ్లకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు రంపాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. తీవ్ర గాయాలపాలైన బాలికను తొలుత అనంతపురం ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం మణిపాల్ ఆసుపత్రిలోని పీఐసీయూలో చికిత్స పొందుతోంది. ఈ కేసును సవాలుగా స్వీకరించిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశారు. హేమంత్ ఆత్మకూరు సమీపంలోని అడవుల్లో దాక్కున్నట్టు సమాచారం అందడంతో, ప్రత్యేక బృందాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. లొంగిపోవాలని పోలీసులు సూచించినప్పటికీ, హేమంత్ వారిపైకి రాళ్లు విసురుతూ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కొందరు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారు. సుమారు ఆరు రౌండ్ల కాల్పులు జరిపినట్టు సమాచారం. బుల్లెట్ గాయాలతో కుప్పకూలిన హేమంత్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.



## బాలసుబ్రహ్మణ్యానికి పోలీసు ఉన్నతాధికారుల నివాళి

హైదరాబాద్, నవంబర్ 1: విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎన్. బాలసుబ్రహ్మణ్యం పార్థివదేహానికి పలువురు సీనియర్, విశ్రాంత పోలీసు అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన నివాళులర్పించారు. అమెరికా నుంచి ఆదివారం రాత్రి ఆయన భౌతికకాయం శంషాబాద్ చేరుకోగా, అధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర భద్రతా సలహాదారు, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ఎన్ఎస్‌జీ మాజీ డీజీ సుదీప్ లఖ్టాకియా, డీజీపీలు మహేశ్ భగవత్, అనిల్ కుమార్, చారు సిన్హా, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐజీ కాంతి రాణా టాటా, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు బాలసుబ్రహ్మణ్యం సేవలను, పోలీసు, రవాణా రంగాల్లో ఆయన చేపట్టిన సంస్కరణలను గుర్తుచేసుకున్నారు. అంకితభావంతో పనిచేసిన సీనియర్ అధికారిని కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ఓటు బచావో సభకు కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు

కూకట్‌పల్లి, నవంబర్ 1 (ఈవార్తలు): న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'ఓటు బచావో దేశ్ బచావో' సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు సభలో ఉత్సాహంగా పాల్గొన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకుల సమక్షంలో సభ జరిగింది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు 'ఓటు చోరీని అడ్డుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం', 'ఓటు బచావో దేశ్ బచావో' అంటూ నినాదాలు చేశాయి. పార్టీ అధిష్ఠానం పిలుపునకు స్పందించి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి సంఘీభావం ప్రకటించారు.


మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



# నీళ్ల కోసం నీళ్లలా ఒడిసిపడదాం!

ప్రకృతి పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుతూ, రానున్న యాసంగి సీజన్‌లో రైతులకు నష్టం వాటిల్లకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టగా, జగిత్యాల జిల్లాలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ బీ సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి సంరక్షణ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు వివిధ శాఖలను సమన్వయం చేస్తూ కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు. వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టడం, అందుబాటులో ఉన్న నీటి నిల్వలను సమర్థంగా వినియోగించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, తాగునీటి భద్రతకు ముందస్తు ఏర్పాట్లు చేయడం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించడం, ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో శాశ్వత నీటి సంరక్షణ ఆస్తులను సృష్టించడం.. ఈ ప్రధాన లక్ష్యాలతో జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది.

- జగిత్యాల, నవంబర్ 1 (ఈవార్తలు)

**జగిత్యాల జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ..**

## వచ్చే 7-8 నెలల నీటి అవసరాలపై మంత్రి అడ్లూరి సమీక్ష

### ఫాం పాండ్లు, బోర్‌వెల్ రీచార్జి, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యం

**మక్కజొన్న, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలకు ప్రోత్సాహం.. తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ద్వారా ప్రజా చైతన్యం**

వాతావరణ మార్పులు..

ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షపాతం..

భూగర్భ జలాలపై పెరుగుతున్న ఒత్తిడి..

సాగునీరు, తాగునీటి అవసరాలు..

వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లు..

విద్యుత్తు వినియోగం పెరిగే అవకాశాలు..

వీటన్నింటినీ ముందుగానే అంచనా వేసి భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా జగిత్యాల జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోంది.



### వర్షపాతం లోటు 9 శాతం.. ఏనా సాధారణ స్థాయిలోనే జిల్లా

జిల్లాలో ప్రస్తుత వర్షపాతం పరిస్థితులను పరిశీలిస్తే ఇప్పటివరకు 815.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 896.7 మిల్లీమీటర్లతో పోలిస్తే ఇది 9 శాతం తక్కువ. ఇప్పటివరకు 51 వర్షపు రోజులు నమోదయ్యాయి. మొత్తం మీద జిల్లాలో వర్షపాతం పరిస్థితి సాధారణ స్థాయిలోనే ఉన్నప్పటికీ భీమారం, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం మండలాల్లో వర్షపాతం లోటు నమోదైంది. మరోవైపు జిల్లాలోని మూడు మండలాలు జగిత్యాల రూరల్, జగిత్యాల, కోడిమ్యాల మండలాలు కరువు అంచనా ప్రమాణాల ప్రకారం మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించబడ్డాయి. ఆయా మండలాల్లో పంట దిగుబడులు వరుసగా 37 శాతం, 34 శాతం, 41 శాతం మేర తగ్గే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు.వర్షపాతం లోటు, మండలాల వారీగా పంటల పరిస్థితి, భూగర్భ జలాల లభ్యతను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## మంత్రి అడ్లూరి ప్రత్యేక చొరవ



ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జగిత్యాల జిల్లాలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అక్టోబర్ 22న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో రానున్న 7 నుంచి 8 నెలల తాగునీటి భద్రత, వ్యవసాయ ప్రణాళిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ పనులపై సమగ్రంగా సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే జూన్ వరకు ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని నీటి వనరుల్లో నిల్వలు, భవిష్యత్తులో నీటి అవసరాలను అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా రానున్న 7 నుంచి 8 నెలల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని, చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. రైతుల ప్రస్తుత పంటలను కాపాడటంతో పాటు యాసంగి సాగుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, అధిక నీటి అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా మక్కజొన్న, పత్తి, కందులు వంటి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నీటి సంరక్షణ పనులలో ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి గ్రామాల్లో దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే ఆస్తులను సృష్టించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా నీటి భద్రతలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 36 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ఈ నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి విడుదల, తాగునీటి అవసరాలు, భవిష్యత్తు వినియోగంపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కాకతీయ ప్రధాన కాలువ ద్వారా అక్టోబర్ 10 నుంచి సుమారు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, దీని ద్వారా 18 మండలాలకు సాగునీరు అందుతోంది. అదేవిధంగా ఫ్లడ్ ఫ్లో కాలువ ద్వారా అక్టోబర్ 14 నుంచి సుమారు 4,300 క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభమైంది. ఈ కాలువ ద్వారా ఎనిమిది మండలాలకు నీరు అందుతోంది. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు అవసరమైన నీటిని అందించడంతో పాటు భవిష్యత్తులో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగునీటి వినియోగాన్ని క్రమబద్ధీకరించాల్సిన అవసరంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.



## 63 శాతం చెరువుల్లో 75 శాతానికిపైగా నీటి నిల్వ

జిల్లాలోని నీటి వనరుల పరిస్థితిని పరిశీలిస్తే మొత్తం 920 చెరువుల్లో 572 చెరువులు 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ నీటి నిల్వను కలిగి ఉన్నాయి. ఇది మొత్తం చెరువుల్లో 63 శాతం. మరో ఆరు చెరువుల్లో పూర్తి సామర్థ్యానికి మించి నీరు ఉండగా, 148 చెరువుల్లో 50 శాతం కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నాయి. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అవసరాలకు అనుగుణంగా వినియోగించడంతో పాటు తక్కువ నీటి నిల్వలు ఉన్న చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 4,20,908 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 3,02,900 ఎకరాల్లో వరి సాగవుతుండగా, మొత్తం సాగు విస్తీర్ణంలో వరి వాటా సుమారు 72 శాతంగా ఉంది. మిగిలిన విస్తీర్ణంలో 38,900 ఎకరాల్లో మక్కజొన్న, 3,700 ఎకరాల్లో పప్పుధాన్యాలు, 5,400 ఎకరాల్లో ఆయిల్‌పామ్, 800 ఎకరాల్లో సోయాబీన్ సాగవుతున్నాయి. ఇతర పంటలు, పండ్ల తోటలు, అటవీ సంబంధిత సాగు కలిపి సుమారు 69,200 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి నీటి అవసరాలు అధికమయ్యే పరిస్థితుల్లో వ్యవసాయ విద్యుత్తు వినియోగం కూడా పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో విద్యుత్తు వినియోగ గణాంకాలు ఇదే విషయాన్ని సూచిస్తున్నాయి. 2025 సెప్టెంబర్‌తో పోలిస్తే 2026 సెప్టెంబర్‌లో విద్యుత్తు వినియోగం 33.32 శాతం పెరిగి 119.96 మిలియన్ యూనిట్లకు చేరింది. అక్టోబర్ 1 నుంచి 15వ తేదీ వరకు 80.99 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 61.89 శాతం అధికం. నవంబర్ 2026లో సుమారు 65 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం ఉంటుందని, గత ఏడాదితో పోలిస్తే 6.26 శాతం పెరుగుదల ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం రోజుకు సుమారు 220 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతోంది. ప్రస్తుతం ఉదయం 7.15 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తొమ్మిది కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ రంగంలో సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా విద్యుత్తు అవసరాలను కొంతమేర తగ్గించడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు. నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా ఉద్యాన శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం జిల్లాలో 37,517 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు, 10,200 ఎకరాల్లో పసుపు, 1,800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులో ఉన్నాయి. 2026-27 రబీ సీజన్‌లో జిల్లాలోని 19 మండలాల్లో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో కూరగాయల సాగును ప్రస్తుత 263 ఎకరాల నుంచి 563 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పుచ్చకాయ, ఇతర మేలన్ పంటల సాగును 28 ఎకరాల నుంచి 300 ఎకరాలకు పెంచాలని ప్రతిపాదించారు. ఆయిల్‌పామ్ సాగును 152 ఎకరాల నుంచి 1,019 ఎకరాలకు విస్తరించడంతో పాటు మొత్తం 1,500 ఎకరాల లక్ష్యాన్ని సాధించాలని ప్రణాళిక రూపొందించారు. మొత్తంగా ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని ప్రస్తుత ప్రతిపాదిత 443 ఎకరాల నుంచి 2,419 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## భూగర్భ జలాలపై నిరంతర నిఘా

ఎల్‌నినో పరిస్థితుల్లో భూగర్భ జలాల లభ్యత అత్యంత కీలకంగా మారనుంది. జిల్లాలో భూగర్భ జలాల స్థితిగతులను నిరంతరం పరిశీలిస్తూ భవిష్యత్తులో నీటి మట్టాలు ఎలా ఉండవచ్చనే అంచనాలను కూడా రూపొందిస్తున్నారు. 2026 సెప్టెంబర్‌లో జిల్లాలో సగటు భూగర్భ జల మట్టం 3.65 మీటర్లుగా నమోదైంది. ఆగస్టుతో పోలిస్తే 0.82 మీటర్ల మేర నీటి మట్టం తగ్గినప్పటికీ, 2025 సెప్టెంబర్‌తో పోలిస్తే 1.32 మీటర్ల మేర మెరుగైన స్థితిలో ఉంది. అక్టోబర్ 2026లో సగటు భూగర్భ జల మట్టం 4.35 మీటర్లకు, నవంబర్‌లో 5.10 మీటర్లకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే కొడిమ్యాల మండలంలో అత్యధికంగా 10.23 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. నవంబర్ నాటికి ఇది 10.78 మీటర్లకు చేరవచ్చని అంచనా. బీర్‌పూర్ మండలంలో అత్యల్పంగా 2.01 మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో మొత్తం 85,974 బోర్‌వెల్స్ ఉండగా, వీటిలో 62 శాతం బోర్లు పనిచేస్తున్నాయి. 34 శాతం బోర్లలో నీటి దిగుబడి తక్కువగా ఉండగా, మరో 4 శాతం బోర్లు ఎండిపోయినట్లు అంచనా వేశారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బోర్‌వెల్ రీచార్జి, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మంత్రి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ బీ సత్యప్రసాద్ నీటి సంరక్షణ పనుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టరేట్‌లో సమీక్షలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జి నిర్మాణాలు, మ్యాజిక్ సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్లు, కాంటూరు కందకాలు, స్టోన్ ట్రెంచెస్ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో పరిస్థితులు మారినా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలు ప్రజలకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం, నీటి సంరక్షణ, విద్యుత్తు పొదుపుపై ఆట, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి వీ శ్రీధర్ తెలంగాణ సాంస్కృతిక సారథి బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామాల్లో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలపై పలు సూచనలు అందించారు. కళాకారులు వివిధ ప్రదర్శనల ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో సందేశాలు అందిస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం, ఫామ్ పాండ్ల ఏర్పాటు, నీటి వనరుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, విద్యుత్తు పొదుపు వంటి అంశాలను వివరిస్తున్నారు.



# రక్తం మరిగిన రహదారి!

## జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై వరుస ప్రమాదాలు

### ప్రమాదకర మలుపులు.. భారీ వాహనాల దూకుడు

### ఏళ్ల తరబడి సాగుతున్న 4 వరుసల రహదారి నిర్మాణ నిరీక్షణ

కరీంనగర్/జగిత్యాల బ్యూరో, నవంబర్ 1 (ఈవార్తలు): ప్రయాణం మొదలుపెట్టిన వారు గమ్యస్థానానికి క్షేమంగా చేరుతారనే నమ్మకం ఉండాలి. కానీ జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తే పరిస్థితి నెలకొంటోంది. ఒక ప్రమాదం మరువకముందే మరో దుర్ఘటన.. ఒక విషాదం నుంచి తేరుకోకముందే ఇంకో కుటుంబంలో కన్నీళ్లు.. ఇలా ఈ మార్గంలో ప్రమాదాలు పునరావృతమవుతున్నాయి. ముఖ్యంగా గంగాధర, కొడిమ్యాల మండలం పూడూర్ పరిసరాలు, కొండగట్టు, బల్వంతాపూర్ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న ఘటనలు రహదారి భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, కుటుంబాలతో ప్రయాణించే వారు, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ పరిస్థితికి వాహనదారుల తప్పిదాలే కారణమా? లేక రహదారి నిర్మాణ జాప్యం, ప్రమాదకర మలుపులు, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం కూడా కారణమా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### వారానికో ప్రమాదం కామన్

ఆదివారం (నవంబర్ 1న) పూడూర్ శివారులో కరీంనగర్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న దంపతుల కారును వేగంగా వచ్చిన సరకు రవాణా లారీ ఢీకొట్టింది. కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అక్టోబర్ 23న ఇదే పూడూర్ సమీపంలో మరో ప్రమాదం జరిగింది. జగిత్యాల డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో హీరాలాల్, ఆయన నాలుగేళ్ల కుమారుడు సంస్కార్ తీవ్రంగా గాయపడ్డారు. చిన్నారితో కలిసి ప్రయాణిస్తున్న తండ్రి ప్రమాదానికి గురికావడం స్థానికులను కలచివేసింది. అక్టోబర్ 18-19 తేదీల్లో పూడూర్ రామాలయం సమీపంలో జరిగిన ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని కరీంనగర్‌కు తిరిగి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కరీంనగర్‌లో విద్యుత్ దుకాణంలో పనిచేస్తున్న సంపత్‌లాల్ (30), ఈశ్వర్ సింగ్ (25) మృతి చెందారు.



### ఏళ్లుగా ఎదురుచూపులే!

కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి-563 విస్తరణ పనుల జాప్యం ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా మారింది. సుమారు 58.86 కిలోమీటర్ల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ముందుకు సాగడంలో తీవ్ర జాప్యం జరిగింది. భూసేకరణ, టెండర్ల ప్రక్రియ తదితర అంశాలు నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ప్రారంభంలో సుమారు రూ.1,503 కోట్లుగా ఉన్న నిర్మాణ వ్యయం పెరిగి రూ.2,484 కోట్లకు చేరింది. ప్రతిపాదిత విస్తరణలో మూడు ప్రాంతాల్లో బైపాస్ రహదారులు, ఆరు పెద్ద వంతెనలు, 18 చిన్న వంతెనలు, 195 కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రకటనలు వెలువడుతున్నా ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు వరుసల రహదారి నిర్మాణం పూర్తయితేనే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పలేం. అయితే పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారి సామర్థ్యాన్ని పెంచడం, ప్రమాదకర ప్రాంతాలను సరిచేయడం అత్యవసరం. జగిత్యాల-కరీంనగర్ రహదారి వేలాది మంది ప్రజలకు నిత్య ప్రయాణ మార్గం. కొండగట్టు వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, సరకు రవాణా వాహనదారులు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారు. అందువల్ల దీని భద్రత ఒక ప్రాంతానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. ప్రజల ప్రాణాలు, ఆర్థిక కార్యకలాపాలు, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన అంశం. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ పరామర్శలు, పరిహారాలు, ప్రకటనలతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలి. నాలుగు వరుసల రహదారి పనులను వేగవంతం చేయడంతోపాటు, నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుత రహదారిపై ప్రమాద నివారణ చర్యలను తక్షణమే అమలు చేయాలి.

**కొండగట్టు వద్ద బస్సు-లారీ ఢీ**

ఆగస్టు 17న జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై కొండగట్టు సమీపంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఆగస్టు 30న గంగాధర మండలం మధురానగర్ చౌరస్తా వద్ద వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను కోళ్ల రవాణా వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఒకవైపు ద్విచక్ర వాహనాలు, మరోవైపు ఆర్టీసీ బస్సులు, సరకు రవాణా వాహనాలు ప్రమాదాలకు గురవుతుండటం గమనార్హం. అంటే సమస్యను ఒకే రకమైన వాహనాలకో, ఒకే తరహా ప్రయాణానికో పరిమితం చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.









కన్యకుమారి చిత్రం

## ప్రకాష్ రాజ్ కెరీర్ క్లోజ్ అవుతోంది: భార్య



విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రకాష్ రాజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఆయన చూపిన ప్రతిభే పాన్-ఇండియా స్థాయిలో నిలబెట్టింది. అయితే సినిమాల విషయానికొస్తే ఎలాంటి ప్రశంసలు అందుకుంటారో? దేశంలో జరిగే సామాజిక, రాజకీయ పరిణామాలపై స్పందించే తీరు కారణంగా అంతే స్థాయిలో వివాదాలను కూడా ఎదుర్కొంటుంటారు. మనసులోని మాటను నిర్భయంగా మాట్లాడే ప్రకాష్ రాజ్ రాజకీయ అభిప్రాయాల వల్ల వృత్తిపరంగా ఎంతో నష్టపోయారని.. పలు సినిమాలు.. వాణిజ్య ప్రకటనలను కోల్పోవాల్సి వచ్చిందని ప్రకాష్ రాజ్ సతీమణి, కొరియోగ్రాఫర్ పోనీ వర్మ తాజాగా వెల్లడించారు. సమాజంలో జరిగే అన్యాయాలపై, ప్రభుత్వ విధానాలపై ప్రకాష్ రాజ్ ఎప్పుడూ ముందుండి గళం వినిపి స్తుంటారన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గౌరీ లంకేష్ హత్య తర్వాత ఆయన మరింత ధైర్యంగా తన గొంతును వినిపించడం మొదలుపెట్టారని పోనీ వర్మ గుర్తు చేసుకున్నారు. ఆ ఘటన ఆయన్ని మానసికంగా ఎంతో కుంగదీసినా? నిశ్శబ్దంగా ఉండకుండా నిజం మాట్లాడాలని నిర్ణయించు కున్నారని తెలిపారు. అయితే ఈ నిర్భయ స్వభావమే ఆయన ప్రొఫెషనల్ లైఫ్‌పై తీవ్ర ప్రభావం చూపిందని.. ఎన్నో అవకాశాలు చేజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్ రాజ్ తీసుకునే రాజకీయ నిర్ణయాల వల్ల నిర్మాతలు వెనకడుగు వేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. అడ్వాన్స్‌లు ఇచ్చినా? కొందరు నిర్మాతలు ప్రాజెక్ట్‌ల నుంచి తొలగించారని, అనేక యాడ్ డీల్స్ కూడా రద్దయ్యాయని వెల్లడించారు. ఇండస్ట్రీలో ప్రకాష్ కు రావాల్సిన ఎన్నో అవకాశాలు కేవలం రాజకీయ కారణాల వల్లే చేజారిపోయాయని.. దీనివల్ల ఆయన ఆర్థికంగా, వృత్తిపరంగా తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అయినా? తన అంతరాత్మ ఏది చెప్తుందో దానినే నమ్ముతారని.. తప్పు జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండలేనని ప్రకాష్ రాజ్ భావిస్తారని పేర్కొన్నారు. ఇలాంటి సున్నితమైన అంశాలపై ప్రకాష్ రాజ్ రోడ్డెక్కి నిరసనలు తెలిపిన సందర్భాల్లో కుటుంబ సభ్యులుగా తాము కూడా ఎంతో ఆందోళన చెందామని పోనీ వర్మ తెలిపారు.

## మోక్షజ్ఞ డెబ్యూ మూవీలో ఇద్దరు బాలీవుడ్ భామలు?



నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోక్షజ్ఞ డెబ్యూ మూవీపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో మోక్షజ్ఞ తన మొదటి సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇప్పటికే వచ్చిన అధికారిక ప్రకటనతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన వార్త తెగ వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజోల్‌ను తీసుకోబోతున్నట్లు సమాచారం. అంతేకాకుండా, మోక్షజ్ఞ సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ భామ రాషా తడానీ నటించనుందని సమాచారం.భారీ సోషియో-ఫాంటసీ కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో హై-లెవెల్ విఎఫ్ఎక్స్ హంగులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు తెలుస్తోంది.



## మొదలైన రాంచరణ్-సుకుమార్ సినిమా

'రంగస్థలం' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత రామ్ చరణ్, సుకుమార్ కలయికలో మరో సినిమా వస్తుందని అప్పట్లోనే వినిపించింది. రామ్ చరణ్ 'పెద్ది' సినిమా చేస్తున్న సమయంలో ఈ సినిమా గురించి ప్రకటన చేసారు. ఇప్పుడు ఆ సమయం రానే వచ్చింది. రామ్ చరణ్, సుకుమార్ కలయికలో మైత్రి మూవీ మేకర్స్, టి -సిరీస్ నిర్మాణంలో కొత్త సినిమా ఆదివారం ఉదయం రామానాయుడు స్టూడియోలో పూజ కార్యక్రమాలతో మొదలైంది. రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 17వ సినిమా ఇది. ఆ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజ కార్యక్రమాల అనంతరం తొలి సన్నివేశానికి చిరంజీవి క్లాప్ కొట్టారు. నిర్మాత కెఎల్ నారాయణ, గోపీచంద్ మలినేని తదితరులు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## మరో రెండు సౌత్ సినిమాల్లో డర్టీ భామ!

దక్షిణాది చిత్రసీమలో ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్న నటి విద్యాబాలన్ తమిళ పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ ఆర్టిస్ట్‌గా మారిపోతున్నారు. ఇటీవల విడుదలైన సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రం జైలర్ 2లో నటనతో ఆకట్టుకున్న సీనియర్ బ్యూటీ కి కోలీవుడ్ నుంచి వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న విద్య కోలీవుడ్‌లోని ప్రముఖ దర్శకులు ... అగ్ర కథానాయకుల ప్రాజెక్ట్‌లలో కీలక పాత్రలు దక్కించుకుంటూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా



మారుతున్నారు. జైలర్ 2 సాధించిన భారీ విజయం డర్టీభామ కెరీర్‌కు ఊహించని మైలేజ్‌ను అందించింది. ఆ చిత్రంలో విద్య కనిపించిన విధానం .. పాత్రలోని తీరు తెన్నులు తమిళ ప్రేక్షకులను మెప్పించాయి. పెద్ద బ్యానర్ల నుంచి వస్తున్న అవకాశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తూ కెరీర్‌కు ప్లస్ అయ్యే వైవిధ్యమైన పాత్రలను మాత్రమే విద్య ఎంపిక చేసు కుంటున్నారు. ఈ నేపథ్యంలోనే హిందీ దర్శకుడు ఆర్ బాల్కీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రత్యేక తమిళ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆర్ బాల్కీ చిత్రాల్లో నటీనటుల పాత్రలు వినూత్నంగా, మానవీయ సంబంధాలకు అద్దం పట్టేలా ఉంటాయి. అలాంటి విలక్షణ దర్శకుడి క్రాఫ్ట్‌లో భాగం కావడం విద్యాబాలన్ నటనలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని చెప్పొచ్చు. ఇందులో విద్య పాత్రకు సంబంధించిన విషయాలను యూనిట్ గోప్యంగా ఉంచింది. అయితే ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో విద్య స్థానం మరింత పటిష్టం కావడం ఖాయమని తెలుస్తోంది. అలాగే కోలీవుడ్ మీడియాలో విద్య తదుపరి ప్రాజెక్ట్‌లపై ఓ సంచలన ప్రచారం నడుస్తోంది.



## రానా నిర్మాణంలో రవిబాబు - కంగనా మూవీ

టాలీవుడ్ స్టార్ రానా దగ్గుబాటి ఒక క్రేజీ సర్‌ప్రైజ్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. డిఫరెంట్, హారర్ సినిమాలతో పేరుగాంచిన తెలుగు నటుడు, దర్శకుడు రవిబాబు దర్శకత్వంలో తాను 'స్మోరీ పిక్చర్' అనే హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించనున్నట్లు తెలిపారు. ఇక ఈ విషయాన్ని కంగనా రనౌత్ స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అధికారికంగా వెల్లడించింది. హారర్‌కాన్ ఈవెంట్‌లో రానా మాట్లాడిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తెలుగులో ఎన్నో విజయవంతమైన హారర్ సినిమాలను అందించిన రవిబాబుకి హిందీలో ఇది తొలి చిత్రమని రానా తెలిపారు. ఈ వేదికపైనే సినిమా టైటిల్‌ను మొదటిసారిగా రివీల్ చేస్తున్నామని, హిందీ మీడియాకు కూడా ఈ సమాచారం ముందుగా ఇవ్వలేదని రానా పేర్కొన్నారు.

## కంగ్రాట్స్ టూ కయ్యదు లోహర్: విజయం

కయ్యదు లోహర్

యంగ్ బ్యూటీ కయ్యదు లోహర్ వరుస ప్రాజెక్ట్‌తో ఫుల్ బిజీ అయిపోయారు. సూర్య-48 మూవీతో పాటు 'మంజుమ్మల్ బాయ్స్'లోనూ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో పలు విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా, ట్రావెల్ వ్లాగర్ ఇవాపై తనకున్న ప్రత్యేకమైన అభిమానాన్ని, గౌరవాన్ని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తెలియజేశారు. "ఇంటర్నెట్ నాకు చేసిన ఉత్తమమైన పనులలో ఒకటి ఇవా జుబెక్‌ను పరిచయం చేయడం. మీ స్ఫూర్తి, మీ ధైర్యం, మీరు ప్రవర్తించే తీరు నాకు చాలా ఇష్టం. జీవితాన్ని ఎంచుకోవడానికి మిమ్మల్ని చూసి నేను చాలా నేర్చుకున్నాను. ఇంకా సాహసోపేతంగా ఉండటానికి, నా సౌకర్యవంతమైన పరిధి నుండి బయటకు రావడానికి మీరు నాకు స్ఫూర్తినిచ్చారు. కంఫర్ట్ జోన్ దాటితేనే అసలైన విజయం వస్తుందని అర్థమయ్యేలా చేశారు. ఆమె నన్ను ఈ ప్రపంచాన్ని మరింత చూడాలని, జీవితాన్ని అనుభవించాలని కోరుకునేలా చేస్తున్నారు. కొంచెం నిర్భయంగా ఎప్పటికైనా మీతో కలిసి ఒక సాహసయాత్రకు వెళ్లి, మీ ప్రపంచాన్ని కొంతైనా స్వయంగా అనుభవించే అవకాశం నాకు లభిస్తుందని ఆశిస్తున్నాను. అది నా డ్రీమ్" అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.



## ఇషాన్ కిషన్
## అరుదైన ఘనత

టీమిండియా యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన ఐదో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 32 బంతుల్లో 61 పరుగులు చేసి జట్టు స్కోరు పెరగడంలో కీలక పాత్ర పోషించాడు. 2022లో టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 31 ఇన్నింగ్స్‌ల్లో 1,164 పరుగులు చేశాడు. ఇప్పటివరకు ఇదే భారత రికార్డుగా ఉంది. ఇషాన్ ఈ ఏడాది 37 ఇన్నింగ్స్‌ల్లో 1,220 పరుగులు చేసి ఆ రికార్డును అధిగమించాడు. ఐదో టీ20కి ముందు అతడి ఖాతాలో 1,159 పరుగులు ఉన్నాయి. సూర్య రికార్డును అధిగమించడానికి మరో ఆరు పరుగులు అవసరం కాగా.. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఆ మైలురాయిని చేరుకున్నాడు. ఒక క్యాలెండర్ ఏడాదిలో టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ ప్రస్తుతం నాలుగో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రియా ఆటగాడు కరణ్‌బీర్ సింగ్ 1,488 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ ఆటగాడు మహ్మద్ రిజ్వాన్ 1,326 పరుగులతో రెండో స్థానంలో, బహ్రెయిన్ ఆటగాడు ఫయాజ్ అహ్మద్ 1,251 పరుగులతో మూడో స్థానంలో ఉన్నారు. టెస్టు హోదా కలిగిన దేశాల ఆటగాళ్లలో ఇషాన్ రెండో స్థానంలో నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో ఇషాన్ అంతర్జాతీయ టీ20ల్లో 2 వేల పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. బంతుల పరంగా ఈ ఘనత సాధించిన మూడో వేగవంతమైన భారత ఆటగాడిగా నిలిచాడు. ఇషాన్ 1,345 బంతుల్లో ఈ పరుగులు పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ 1,024 బంతుల్లో, సూర్యకుమార్ యాదవ్ 1,164 బంతుల్లో ఈ మైలురాయిని చేరుకున్నారు. ఈ సిరీస్‌లో ఇషాన్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లేదు. ఆడిన తొలి మ్యాచ్‌లో ఒక పరుగు, నాలుగో టీ20లో సున్నాకే వెనుదిరిగాడు. కుడి తొడ కండరాల గాయంతో మధ్యలో రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చివరి మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసి రెండు కీలక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

## నెట్స్‌లో కోహ్లీకి చుక్కలు

న్యూజిలాండ్‌తో జరగనున్న తొలి వన్డేకు ముందు టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. భారత జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. ఓ యువ పేసర్ బౌలింగ్‌కు తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. ఆదివారం ఆక్లాండ్‌లో జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో, జట్టులోకి కొత్తగా వచ్చిన అకీబ్ నబీ తన పదునైన బంతులతో కోహ్లీని ఉక్కిరిబిక్కిరి చేశాడు. టీ20 సిరీస్ ముగియనుండటంతో, వన్డే సిరీస్‌పై దృష్టి పెట్టిన భారత ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో, గాయపడిన ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో జట్టులోకి వచ్చిన జమ్మూకశ్మీర్ పేసర్ అకీబ్ నబీ తన బౌలింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ కోహ్లీని పలుమార్లు బీట్ చేశాడు. కొన్ని బంతులు ఎడ్జ్ తీసుకుని వెళ్లగా, మరికొన్ని ఇన్-డిప్పర్‌లు నేరుగా ప్యాడ్లను తాకాయి. దీంతో విరాట్ కోహ్లీ కాస్త అసహనానికి గురైనట్లు, ఫ్రస్ట్రేషన్ వ్యక్తం చేసినట్లు క్రీడా వెబ్‌సైట్ 'రివ్‌స్పోర్ట్' తన కథనంలో పేర్కొంది. అయితే, కోహ్లీ త్వరగానే తేరుకుని తన క్లాస్ షాట్లతో ఆకట్టుకున్నాడు. సెషన్ చివర్లో కెప్టెన్ రోహిత్ శర్మతో సరదాగా మాట్లాడుతూ కనిపించాడు. మరోవైపు రోహిత్ శర్మ ఆచితూచి ఆడుతూ డిఫెన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. కేఎల్ రాహుల్, రుతురాజ్ గైక్వాడ్ కూడా ఈ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. అయితే, శుభ్‌మన్ గిల్ ఈ సెషన్‌కు హాజరు కాలేదు. ఇటీవల ఇండియా ఏ తరఫున అద్భుతంగా రాణించిన అకీబ్ నబీ, ఇప్పుడు సీనియర్ జట్టులోనూ తన సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. సీనియర్ బ్యాటర్లను యువ బౌలర్లు ఇలా ఇబ్బంది పెట్టడం జట్టుకు శుభపరిణామమని విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే నవంబర్ 4న ఆక్లాండ్‌లో జరగనుంది.



## హర్మన్‌ప్రీత్ హ్యాట్రిక్

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీలో ఆతిథ్య భారత్ జోరు మామూలుగా లేదు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో దుమ్ము రేపడంతో మన జట్టు లీగ్ దశలో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 4-2తో మలేసియాను ఓడించింది.



ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ (3వ, 33వ, 58వ నిమిషం) మూడు గోల్స్‌తో మురిపించాడు. స్ట్రయికర్ సుఖ్‌జీత్ సింగ్ (43 ని) మరో గోల్ చేశాడు. అఖిముల్లా అస్వర్ (25 ని), షెల్లో సిల్వేరియస్ (60 ని) మలేసియాకు గోల్స్ అందించారు. ఆరు జట్ల ఈ టోర్నీలో భారత్, మలేసియాతోపాటు జపాన్, దక్షిణ కొరియా ఇప్పటికే సెమీఫైనల్లో ప్రవేశించాయి. సోమవారం జరిగే ఆఖరి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ తలపడుతుంది. ఆదివారం జరిగిన ఇతర మ్యాచుల్లో దక్షిణ కొరియా 5-0తో బంగ్లాదేశ్‌పై గెలుపొందగా.. చైనా, జపాన్ జట్ల మధ్య పోరు 2-2తో డ్రాగా ముగిసింది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీలో ఆతిథ్య భారత జట్టు వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. మలేసియా జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 4--2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మూడు గోల్స్‌తో (3వ, 33వ, 58వ నిమిషాల్లో) 'హ్యాట్రిక్' సాధించగా... సుఖ్‌జీత్ సింగ్ (43వ ని.లో) ఒక గోల్ చేశాడు. మలేసియా జట్టుకు అఖిముల్లా (25వ ని.లో), షెల్లో సిల్వెరియస్ (60వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. తమకు లభించిన ఏడు పెనాల్టీ కార్నర్‌లలో మూడింటిని... ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను టీమిండియా గోల్స్‌గా మలిచింది. మలేసియా తమకు లభించిన మూడు పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుంది. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ 12 పాయింట్లతో, మలేసియా 9 పాయింట్లతో ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్నాయి. నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. ఆదివారం జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో కొరియా 5--0తో బంగ్లాదేశ్‌ను ఓడించగా... చైనా, జపాన్ మ్యాచ్ 2--2తో 'డ్రా'గా ముగిసింది.





## సింధు రికార్డు..

### హైలో ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం

భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు మరోసారి చరిత్ర సృష్టించింది. జర్మనీ వేదికగా ముగిసిన ప్రతిష్ఠాత్మక హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ విభాగంలో ఛాంపియన్‌గా నిలిచింది. భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు మరోసారి చరిత్ర సృష్టించింది. జర్మనీ వేదికగా ముగిసిన ప్రతిష్ఠాత్మక హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆమె అద్భుత ప్రదర్శన కనబరిచింది. మహిళల సింగిల్స్ విభాగంలో ఛాంపియన్‌గా నిలిచి సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఇవాళ(ఆదివారం) జరిగిన హైలో ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ తుదిపోరులో పీవీ సింధు డెన్మార్క్‌కు చెందిన లైన్ జార్స్‌ఫెల్డ్‌ను 21-12, 21-14 తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది. ఈ టోర్నీ చరిత్రలో పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్డ్ డబుల్స్ విభాగాల్లో భారత ఆటగాళ్లు గతంలో టైటిల్స్ సాధించినప్పటికీ.. మహిళల సింగిల్స్ ట్రోఫీని గెలుచుకోవడం మాత్రం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా షట్లర్‌గా సింధు అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్ పోరులో సింధు తనదైన దూకుడును ప్రదర్శించింది. అద్భుతమైన స్మాష్‌లతో ప్రత్యర్థికి ఎక్కడా అవకాశం ఇవ్వకుండా సింధు విజయం సాధించింది. గత కొంతకాలంగా ఫామ్ కోసం శ్రమిస్తున్న ఈ తెలుగు తేజం, ఈ విజయంతో మళ్లీ తన సత్తా ఏంటో నిరూపించుకుంది. సింధు సాధించిన ఈ చరిత్రాత్మక విజయంపై ప్రశంసల జల్లు కురుస్తున్నాయి.



## భారత్ బౌలర్లపై కివీస్ పంజా

3-2తో సిరీస్ ముగింపు

ఐదో టీ20లోనూ భారత జట్టుకు నిరాశే ఎదురైంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ అద్భుతంగా ఆడి భారత్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. లక్ష్యాన్ని న్యూజిలాండ్ 18 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి మూడు మ్యాచ్ ల్లో వరుస విజయాలతో భారత్ ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, చివరి రెండు మ్యాచ్ ల్లోనూ న్యూజిలాండ్ నెగ్గడంతో, ఈ ఐదు మ్యాచ్ ల సిరీస్ లో భారత్ ఆధిక్యం 3-2కి తగ్గింది. నేటి మ్యాచ్ విషయానికొస్తే.. భారత్ ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (61; 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (50; 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. నమన్ ధీర్ 33, నితీశ్ కుమార్ రెడ్డి 22 పరుగులు చేశారు. అయితే మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 19 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. నాథన్ స్మిత్, బ్లెయిర్ టిక్నర్ రెండేసి వికెట్లు తీశారు. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్‌కు టిమ్ సీఫర్ట్ (93; 50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్; 38 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుత విజయాన్ని అందించారు. డారిల్ మిచెల్ 29 పరుగులతో రాణించాడు. సీఫర్ట్-మిచెల్ జోడీ రెండో వికెట్‌కు 73 పరుగులు జోడించగా, సీఫర్ట్-ఫిలిప్స్ జంట మూడో వికెట్‌కు 86 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్ రెడ్డి ఒక్కో వికెట్ తీశారు. సీఫర్ట్-ఫిలిప్స్ ధాటికి భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. మరో రెండు ఓవర్లు మిగిలుండగానే కివీస్ లక్ష్యాన్ని అందుకుంది.





## ఫీల్డింగ్ వల్లే ఓటమి: శ్రేయస్

బ్యాటింగ్‌లో కోల్పోయిన ఊపు, బౌలింగ్, ఫీల్డింగ్‌లో పేలవ ప్రదర్శనే న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో ఓటమికి కారణమని భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అభిప్రాయపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్‌తో కలిసి మంచి భాగస్వామ్యం నెలకొల్పినా.. వరుస ఓవర్లలో వికెట్లు కోల్పోవడంతో ఆశించిన స్కోరు సాధించలేకపోయామని చెప్పాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాల్సిందని అంగీకరించాడు. ఇషాన్ కిషన్ (61), శ్రేయస్ అయ్యర్ (50) 11, 12వ ఓవర్లలో వరుసగా ఔటవడంతో భారత్ ఇన్నింగ్స్ జోరు తగ్గింది. కొత్తగా క్రీజులోకి వచ్చిన బ్యాటర్లపై ఒత్తిడి పెరిగిందని శ్రేయస్ తెలిపాడు. పిచ్‌పై బంతి స్వింగ్ అవడంతో పాటు కొన్ని సందర్భాల్లో వేగంగా దూసుకొచ్చిందని చెప్పాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
సోమవారం 2-11-2026, జగిత్యాల
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# ఆశలు నిలబెడితేనే అండగా ఉంటారు!

యువత ఏ పార్టీకి అండగా నిలిస్తే ఆ పార్టీ భవిష్యత్తుకు తిరుగుండదు. మార్పును కోరుకునే తత్వం, కొత్త ఆలోచనలను ఆహ్వానించే గుణం, సాహసంతో ముందడుగు వేసే స్వభావం యువత సొంతం. అందుకే యువతను ఆకర్షించే రాజకీయ పార్టీలకు ప్రజల్లో బలమైన పునాది ఏర్పడుతుంది. ఈ విషయంలో భారతీయ జనతా పార్టీకి యువత నుంచి గణనీయమైన మద్దతు లభించింది వాస్తవం. అయితే, ఆ మద్దతును శాశ్వత బలంగా మార్చుకోవడంలోనే పార్టీ అసలు పరీక్షను ఎదుర్కొంటోంది. యువత తమవైపు ఉన్నారనే ధీమాతో ఉంటే సరిపోదు. వారి ఆలోచనలను అర్థం చేసుకోవాలి. ఆకాంక్షలకు అనుగుణంగా అడుగులు వేయాలి. వారి అసహనానికి కారణాలను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషించాలి. దేశ రాజకీయాల్లో యువత పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థ.. ఇవన్నీ యువత కోరుకుంటున్న ప్రధాన అంశాలు. దేశం అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతోపాటు తమ వ్యక్తిగత జీవితాల్లోనూ గణనీయమైన మార్పు రావాలని వారు ఆశిస్తున్నారు. జాతీయత, దేశాభివృద్ధి, బలమైన నాయకత్వం వంటి అంశాలు యువతలోని ఒక వర్గాన్ని బీజేపీ వైపు ఆకర్షిస్తుండవచ్చు. కానీ, రాజకీయ ఆకర్షణ ఒక్కటే యువత మద్దతును నిలబెట్టలేదు. ఆ ఆకర్షణకు ఆచరణ తోడవ్వాలి. ఆశలకు ఫలితాలు జతకావాలి. ప్రస్తుతం కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ప్రభుత్వ విధానాలపై ఆందోళనలు, నిరసనలు ఉధృతం చేస్తున్నాయి. యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ అధికార పక్షాన్ని నిలదీస్తున్నాయి. ఈ రాజకీయ పోరాటంలో బీజేపీకి ఉన్న యువత మద్దతు కీలకమైనదే. అయితే, ప్రతిపక్షాల ఆందోళనలను తిప్పికొట్టడం లేదా రాజకీయ విమర్శలకు సమాధానాలు చెప్పడంతోనే యువతను కాపాడుకోలేరు. యువతలో పెరుగుతున్న అసహనాన్ని కేవలం ప్రత్యర్థుల రాజకీయ ప్రచారంగా కొట్టిపారేయడం కూడా పొరపాటే. ఆ అసహనం వెనుక వాస్తవ సమస్యలున్నాయా? ఉంటే వాటిని పరిష్కరించేందుకు ఏం చేస్తున్నాం? అనే ప్రశ్నలకు పార్టీ నాయకత్వం సమాధానాలు వెతకాలి. యువతకు ఉపాధి కల్పన, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నియామక ప్రక్రియల్లో జాప్యానికి అడ్డుకట్ట, విద్యావంతులకు తగిన అవకాశాలు, కొత్త వ్యాపారాల స్థాపనకు ప్రోత్సాహం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ అవసరం. ఎన్నికల సమయంలో యువతను ఆకట్టుకునే హామీలు ఇవ్వడం కంటే, నిరంతరం వారితో మమేకమై వారి సమస్యలను పరిష్కరించడం ముఖ్యం. నిరుద్యోగి ఆవేదనను అర్థం చేసుకోకుండా దేశాభివృద్ధి గురించి ఉపన్యాసాలు ఇస్తే ప్రయోజనం ఉండదు. ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువకుడికి రాజకీయ నినాదాల కంటే తన భవిష్యత్తుపై భరోసానే ముఖ్యం. చదువుకు చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడుతున్న యువతకు అవకాశాలు కల్పించడమే నిజమైన భరోసా. ఇక్కడ బీజేపీ నాయకత్వం ఒక విషయాన్ని గుర్తించాలి. యువత మద్దతు అనేది శాశ్వతంగా లభించే రాజకీయ ఆస్తి కాదు. అది నమ్మకంపై ఆధారపడిన బాధ్యత. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే యువతతో నిరంతర సంభాషణ జరగాలి. పార్టీ కార్యక్రమాల్లో యువతకు స్థానం కల్పించడమే కాకుండా, నిర్ణయాల్లోనూ వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ శ్రేణులు గుర్తించి నాయకత్వానికి చేరవేయాలి. సమస్యలను చెప్పేవారిని అసంతృప్తివాదులుగా చూడకుండా, లోపాలను సరిదిద్దుకునేందుకు దోహదపడే స్వరాలుగా పరిగణించాలి. మరోవైపు, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు యువతలోని అసంతృప్తిని రాజకీయంగా ఉపయోగించుకోవాలని ప్రయత్నించడం సహజమే. ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉంది. అయితే, నిరసనలు చేయడమే పరిష్కారం కాదు. యువతకు ప్రత్యామ్నాయ విధానాలు ఏమిటి? ఉపాధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవకాశాలపై వారి ప్రణాళిక ఏమిటి? అనే అంశాలపై ప్రతిపక్షాలూ స్పష్టత ఇవ్వాలి. యువత సమస్యలను ఎన్నికల అస్త్రాలుగా ఉపయోగించుకోవడం కాకుండా, వాటి పరిష్కారానికి బాధ్యతాయుతమైన ప్రతిపాదనలు ముందుకు తేవాలి. బీజేపీకి ఇప్పటికిప్పుడు కావాల్సింది రాజకీయ ప్రత్యర్థులపై ఎదురుదాడి మాత్రమే కాదు.. యువతలో ఏర్పడుతున్న అసహనాన్ని తగ్గించే కార్యాచరణ. యువతతో చర్చలు, సమస్యలపై బహిరంగ సమీక్షలు, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం, ప్రభుత్వ పథకాల అమలుపై జవాబుదారీతనం.. ఇలాంటి చర్యలు నమ్మకాన్ని పెంచుతాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా తన విధానాల ఫలితాలను ప్రజలకు వివరించడంతోపాటు, లోపాలుంటే వాటిని అంగీకరించి సరిదిద్దుకునే ధైర్యాన్ని కూడా ప్రదర్శించాలి. ఎన్నికలు సమీపించినప్పుడు యువతను చేరుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం కంటే, ఎన్నికలకు ముందున్న ప్రతి రోజూ వారి విశ్వాసాన్ని సంపాదించుకోవడం ముఖ్యం. యువత రాజకీయంగా చైతన్యవంతులవుతున్నారు. సమాచారాన్ని పరిశీలిస్తున్నారు. వాగ్దానాలను పనితీరుతో పోల్చి చూస్తున్నారు. సోషల్ మీడియా ప్రచారానికి ఆకర్షితులైనంత మాత్రాన వాస్తవ సమస్యలను మరిచిపోరు. తమ ఆకాంక్షలకు తగిన ప్రాధాన్యం లభించకపోతే ప్రత్యామ్నాయాల వైపు చూడటానికి వెనుకాడరు. అందుకే బీజేపీ నాయకత్వం యువత మద్దతును సహజమైన విజయంగా భావించకూడదు. దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యతగా గుర్తించాలి. యువతే బలం అనుకుంటున్న పార్టీకి, అదే యువత అసంతృప్తి బలహీనతగా మారకుండా జాగ్రత్త పడాలి. ఇప్పటి నిర్లక్ష్యం రేపటి రాజకీయ నష్టానికి దారితీయవచ్చు. ఇప్పటి చొరవ భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చు.

# మనకు కావాలి.. జపాన్ మోడల్!





**నవీన్ కుమార్ రెడ్డి**
**సీనియర్ జర్నలిస్ట్**
**ఫోన్ నంబర్: 800 800 1803**

ఒక దేశం తన వద్ద లేని సహజ వనరులను సృష్టించుకోలేదు. కానీ వాటికంటే విలువైనదాన్ని సృష్టించుకోగలదు. అదే నైపుణ్యం కలిగిన మానవ వనరులు. సహజ వనరులు పరిమితంగా ఉన్నా.. విద్యావంతులు, నైపుణ్యం కలిగిన ప్రజలు ఉంటే దేశం పారిశ్రామిక శక్తిగా ఎదగగలదని ప్రపంచానికి చూపించిన దేశాల్లో జపాన్ ఒకటి. రెండో ప్రపంచ యుద్ధంలో దెబ్బతిన్న దేశం.. కొద్దికాలంలోనే ప్రపంచ పారిశ్రామిక శక్తిగా ఎదగడం వెనుక కేవలం పెట్టుబడులు, యంత్రాలు, విదేశీ సాంకేతికత మాత్రమే లేవు. విద్యను దేశ నిర్మాణానికి ప్రధాన సాధనంగా మలచిన దూరదృష్టి ఉంది. జపాన్ విద్యా వ్యవస్థ ఒక్కరోజులో ఈ రూపాన్ని సంతరించుకోలేదు. కాలానుగుణంగా మారింది. సమాజం మారితే విద్య మారింది. పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులు మారాయి. సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ మారింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత దేశ పునర్నిర్మాణం ప్రారంభమైనప్పుడు విద్యా వ్యవస్థను కూడా కొత్త అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించారు. 1950-60 దశకాల్లో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నప్పుడు, పరిశ్రమలకు కావాల్సిన సాంకేతిక మానవ వనరులను తయారు చేయడంపైనే జపాన్ దృష్టి సారించింది. విద్యా విస్తరణ, శాస్త్ర సాంకేతిక పురోగతి, పారిశ్రామిక వృద్ధి పరస్పరం ముడిపడి ఉన్నాయని గుర్తించింది.

1868లో ప్రారంభమైన మేజీ పునరుద్ధరణ తర్వాత జపాన్ ఆధునికీకరణకు విద్యను ప్రధాన సాధనంగా ఉపయోగించింది. ప్రాథమిక విద్యను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం, ఉన్నత విద్య ద్వారా నిపుణులను తయారు చేయడం, తరువాత వృత్తి విద్యను విస్తరించడం.. ఇలా విద్యా వ్యవస్థ క్రమంగా పరిశ్రమ అవసరాలకు అనుసంధానమైంది. జపాన్ విద్యా మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం.. ప్రాథమిక విద్య విస్తరించడంతో ప్రజల్లో నైపుణ్యాలు పెరిగాయి. ఆ తర్వాత సెకండరీ ఎడ్యుకేషన్, వృత్తి విద్య, మహిళా విద్య విస్తరించాయి. భారీ పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఉన్నత విద్య కూడా విస్తరించింది. అంటే దేశ ఆర్థిక నిర్మాణం ఏ దిశగా వెళ్తే.. విద్యా వ్యవస్థ కూడా అదే దిశగా రూపాంతరం చెందింది. విద్య అనేది ఆర్థిక వ్యవస్థకు వేరుగా నడిచే వ్యవస్థ కాదు. ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మానవ వనరులను తయారు చేసే వ్యవస్థ. రెండో ప్రపంచ యుద్ధం ముగిసేసరికి జపాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. అయినా ఆ దేశం పునర్నిర్మాణంలో విద్యకు పెద్దపీట వేసింది. యుద్ధానంతర కాలంలో 6-3-3-4 విద్యా వ్యవస్థను జపాన్‌లో ఏర్పాటు చేశారు. తప్పనిసరి విద్యను విస్తరించారు. 1950-60 దశకాల్లో ఆర్థిక వృద్ధి వేగం పెరిగిన కొద్దీ ఉన్నత పాఠశాలల్లో చేరికలు, ఉన్నత విద్య, సాంకేతిక విద్య కూడా విస్తరించాయి. దేశానికి ఏ రకమైన మానవ వనరులు అవసరం? పరిశ్రమలకు ఎలాంటి సాంకేతిక నిపుణులు కావాలి? ఎలాంటి నైపుణ్యాలు నేర్పితే యువత ఉద్యోగంలో వెంటనే ఉపయోగపడతారు? ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం విద్యా వ్యవస్థను మార్చారు.

కోసెన్ వ్యవస్థకు అంకురార్పణ

1950ల చివర్లో జపాన్ ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరిగింది. పరిశ్రమలు విస్తరించాయి. శాస్త్ర సాంకేతిక రంగాలు వేగంగా ముందుకు వెళ్లాయి. కానీ పరిశ్రమలకు అవసరమైన ప్రాక్టికల్ ఇంజినీర్ల కొరత విపరీతంగా ఉండేది. దీంతో నిపుణులను మరింత పెద్ద సంఖ్యలో తయారు చేయాల్సిన అవసరం ఏర్పడింది. కోసెన్ అంటే సాధారణ కళాశాల కాదు. జూనియర్ హైస్కూల్ పూర్తి చేసిన 15 ఏళ్ల విద్యార్థిని చేర్చుకుని ఐదేళ్లపాటు సమగ్ర సాంకేతిక విద్య అందించే ప్రత్యేక ఉన్నత సాంకేతిక విద్యా విధానం. ప్రస్తుతం జపాన్‌లో 51 జాతీయ కోసెన్లు ఉన్నాయి. ప్రధాన కోర్సు తర్వాత రెండేళ్ల ఐచ్ఛిక అధ్యయన కూడా ఉంటుంది. అవసరమైతే విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య కొనసాగించే మార్గమూ ఉంటుంది. అంటే.. విద్యార్థికి ఒకే దారి కాదు. ఉద్యోగం కావాలంటే ఉద్యోగం. ఇంకా చదవాలంటే ఉన్నత విద్య. పరిశోధన చేయాలంటే పరిశోధన. ఇదే కోసెన్ ప్రత్యేకత. మన దగ్గర సాధారణంగా విద్యార్థి ముందుగా పాఠశాల.. ఆ తర్వాత ఇంటర్.. ఆపై డిగ్రీ లేదా ఇంజినీరింగ్.. ఆ తర్వాత ఉద్యోగం అనే మార్గంలో వెళ్తాడు. కోసెన్లో మాత్రం 15 ఏళ్ల నుంచే సాంకేతిక విద్యకు ప్రత్యేక మార్గం తెరుచుకుంటుంది. సాధారణ విద్యతోపాటు ప్రత్యేక సాంకేతిక సబ్జెక్టులు, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, చివర్లో పరిశోధన.. ఇలా ఐదేళ్లపాటు ఒకే సమగ్ర విద్యా ప్రయాణం సాగుతుంది. ఇది తొందరగా పిల్లలను ఒక వృత్తిలోకి నెట్టడం కాదు. ఆసక్తి ఉన్న విద్యార్థికి చిన్న వయసులోనే సాంకేతిక ప్రపంచాన్ని పరిచయం చేయడం. జపాన్ సాంకేతిక విద్యలోని మరో ముఖ్యమైన మార్పు.. ప్రాక్టికల్ విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం. తెలంగాణ ప్రతినిధి బృందం ఇటీవల సందర్శించిన ఫుకుయామా హయ్యర్ టెక్నికల్ స్కూల్‌లో సుమారు 60 శాతం ప్రాక్టికల్, 40 శాతం థియరీ ఆధారంగా శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ 60:40 నిష్పత్తి వెనుక ఉన్న తత్వం ముఖ్యమైనది. వెల్డింగ్ గురించి చదవడం కాదు.. వెల్డింగ్ చేయాలి. వైరింగ్ గురించి తెలుసుకోవడం కాదు.. వైరింగ్ చేయాలి. ఇంజిన్ గురించి చదవడం కాదు.. ఇంజిన్‌ను విడదీయాలి, లోపం గుర్తించాలి, మళ్లీ అమర్చాలి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడం మాత్రమే కాదు.. అది ఎందుకు పనిచేయడం లేదో కూడా తెలుసుకోవాలి. అక్కడే 'చదువు'.. 'నైపుణ్యం'గా మారుతుంది.

జపాన్ మోడల్‌లో తరగతి గదిలోనే విద్య

ముగియదు. పరిశ్రమలతో ప్రత్యక్ష అనుసంధానం దాని ప్రత్యేకత. కోసెన్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాక్టరీ సందర్శనలు, పరిశ్రమలతో సంయుక్త కార్యక్రమాలు ఉంటాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ నైపుణ్యాలు పెంచడం చదువులో భాగమే. ఇక్కడ విద్యార్థి యంత్రాన్ని ఎలా ఆపరేట్ చేయాలో మాత్రమే నేర్చుకోడు. భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలి? సమయపాలన ఎలా ఉండాలి? టీమ్‌తో ఎలా పనిచేయాలి? నాణ్యతను ఎలా కాపాడాలి? పని ప్రదేశంలో సమస్య వస్తే ఎలా స్పందించాలి? ఇవన్నీ నేర్చుకుంటాడు. అందుకే ఉద్యోగంలో చేరిన తర్వాత సంస్థకు మళ్లీ మొదటి నుంచి శిక్షణ ఇవ్వాల్సిన భారం తగ్గుతుంది. జపాన్ అనుభవంలో మరో ముఖ్యమైన విషయం పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యం. కంపెనీలు కేవలం ఉద్యోగాలు ఇచ్చే సంస్థలు కావు. అవే విద్యా భాగస్వాములు. సాంకేతిక మార్పులు వచ్చినప్పుడు కోర్సులు మారాలి. కొత్త యంత్రాలు వచ్చినప్పుడు శిక్షణ మారాలి. కొత్త పరిశ్రమలు వస్తే కొత్త నైపుణ్యాలు రావాలి. అందుకే కోసెన్ వ్యవస్థను కూడా పరిశ్రమ అవసరాలకు స్పందించేలా రూపొందించారు. 1962లో ప్రారంభించినప్పుడు పరిశ్రమలకు అవసరమైన ప్రాక్టికల్ ఇంజినీర్లను తయారు చేయడమే ప్రధాన లక్ష్యం. కాలం మారడంతో ఇప్పుడు సృజనాత్మకత, అధునాతన సాంకేతికత, అంతర్జాతీయ శిక్షణ వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టారు. జపాన్ విద్యావ్యవస్థలో జరిగిన మార్పులకు ఆ దేశ ఆర్థికాభివృద్ధికి సంబంధం ఉందా? అంటే.. కచ్చితంగా విద్య వల్లే ఆర్థిక అద్భుతం జరిగింది అని చెప్పడం సరైంది కాదు. పారిశ్రామిక విధానాలు, పెట్టుబడులు, ఎగుమతులు, సంస్థల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం.. ఎన్నో అంశాలు కలిసి జపాన్ అభివృద్ధికి కారణమయ్యాయి. అయితే విద్య, మానవ వనరులు అందులో కీలకమైన భాగం. పాన్ విద్యా మంత్రిత్వ శాఖ 1963లో చేసిన విశ్లేషణలో.. యుద్ధానంతర ఆర్థిక పునర్నిర్మాణం, వేగవంతమైన వృద్ధికి ముందుగా కూడబెట్టుకున్న జ్ఞానం, నైపుణ్యాలు, ప్రతిభ అనేవి ముఖ్యమైన మానవ కారకాలుగా పనిచేశాయని పేర్కొంది. ఆధునిక విద్యా వ్యవస్థ విస్తరణ జపాన్ ఆధునికీకరణకు ముఖ్యమైన పునాది వేసిందని కూడా పేర్కొంది. మరో పరిశోధనలోనూ 1950-60 దశకాల్లో జపాన్ కార్మికుల సగటు విద్యా సంవత్సరాలు గణనీయంగా పెరిగాయని పేర్కొంది. అంటే.. జపాన్ విద్యలో పెట్టుబడి పెట్టింది. విద్య నైపుణ్యాన్ని పెంచింది. నైపుణ్యం పరిశ్రమకు బలం ఇచ్చింది. పరిశ్రమ దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపింది. ఇది ఒక్కరోజులో జరిగిన మార్పు కాదు. దశాబ్దాలుగా కొనసాగిన ప్రక్రియ.

కోసెన్ వ్యవస్థలో ఉద్యోగం కోరుకునే గ్రాడ్యుయేట్ల ఉపాధి రేటు దాదాపు 100 శాతంగా ఉందని జాతీయ కోసెన్ సంస్థ చెబుతోంది. గ్రాడ్యుయేట్ల సంఖ్యతో పోలిస్తే సుమారు 10-20 రెట్లు ఉద్యోగ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని కూడా పేర్కొంటోంది. దీనర్థం పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం ఉన్న విద్యార్థులు తక్కువగా ఉండటం వల్ల వారి డిమాండ్ ఎక్కువ. అందుకే విద్యా వ్యవస్థకు ఉద్యోగ మార్కెట్‌తో సంబంధం ఉండటం ఎంత ముఖ్యమో ఇది చూపిస్తుంది. సాంకేతిక విద్య అంటే కేవలం 15-20 ఏళ్ల యువతకు మాత్రమే కాదు. ఉద్యోగం చేస్తున్నవారికి, కొత్త రంగంలోకి మారాలనుకునేవారికి కూడా శిక్షణ అవసరం. ఫుకుయామా వంటి వృత్తి శిక్షణ సంస్థల్లో కొత్తగా ఉద్యోగంలోకి రావాలనుకునేవారితోపాటు ఇప్పటికే పనిచేస్తున్నవారికి, కొత్త నైపుణ్యం నేర్చుకోవాలనుకునేవారికి కూడా అవకాశాలు ఉన్నాయి. ఇది భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో మరింత ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఒకసారి నేర్చుకున్న నైపుణ్యం జీవితాంతం సరిపోదు. ఏఐ వచ్చింది. ఆటోమేషన్ వచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చాయి. రోబోటిక్స్ పెరిగింది. గ్రీన్ టెక్నాలజీ వచ్చింది. ఇకపై ఉద్యోగి కూడా నిరంతరం నేర్చుకోవాల్సిందే.

జపాన్ విద్యా వ్యవస్థను 'అంతా పరిపూర్ణం'గా చూడటం కూడా సరికాదు. వృద్ధాప్య జనాభా, తగ్గుతున్న శ్రామిక వనరులు, డిజిటల్ మార్పు, పరిశ్రమల్లో నైపుణ్య కొరత వంటి కొత్త సవాళ్లు జపాన్ ముందున్నాయి. ఓఈసీడీ-2026 విశ్లేషణ ప్రకారం 2010ల ప్రారంభం నుంచి జపాన్ తీవ్రమైన కార్మిక కొరతను ఎదుర్కొంటోంది. సాంకేతిక నైపుణ్యాలు, విదేశీ భాషల్లో కూడా కొరత ఉందని నివేదిక పేర్కొంది. అంటే జపాన్ కూడా తన పాత విజయ నమూనాపైనే ఆధారపడకుండా కొత్త మార్పులు చేయాల్సిన పరిస్థితిలో ఉంది. అక్కడి సంప్రదాయ మోడల్‌లో కంపెనీనే ఉద్యోగికి పెద్దమొత్తంలో శిక్షణ ఇచ్చేది. కానీ జీవితాంతం ఒకే సంస్థలో పనిచేసే విధానం బలహీనపడుతున్న కొద్దీ.. బయట కూడా శిక్షణ, జీవితాంతం నేర్చుకునే అవకాశాల ప్రాధాన్యం పెరుగుతోంది. ఓఈసీడీ కూడా జపాన్‌లో అడల్ట్ లర్నింగ్ వ్యవస్థను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని చెబుతోంది. ఇది మరో గొప్ప పాఠం. అంటే విజయం సాధించిన విద్యా వ్యవస్థ కూడా కాలంతో పాటు మారాలి.

తెలంగాణ ఏం నేర్చుకోవాలి?

జపాన్ మోడల్‌ను యథాతథంగా తెలంగాణలో అమలు చేయడం సాధ్యం కాదు. ఆ అవసరం కూడా లేదు. కానీ అక్కడి ఆలోచనా విధానం నుంచి చాలా నేర్చుకోవచ్చు. మొదటిది.. విద్యను పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయాలి. రెండోది.. ప్రాక్టికల్ శిక్షణకు పెద్దపీట వేయాలి. ఫుకుయామాలో కనిపించిన 60:40 విధానాన్ని ప్రతి కోర్సుకు అచ్చంగా అమలు చేయాల్సిన అవసరం లేకపోయినా.. 'పని చేస్తూ నేర్చుకోవడం' అనే తత్వాన్ని బలపరచాలి. మూడోది.. పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు, ఆుజులు, స్కిల్ సెంటర్లు, ఇంజినీరింగ్ సంస్థలు, పరిశ్రమలను ఒకే నైపుణ్య వ్యవస్థలోకి తీసుకురావాలి. నాలుగోది.. కరిక్యులమ్‌ను పరిశ్రమలతో కలిసి రూపొందించాలి. ఐదోది.. అధ్యాపకులకు పరిశ్రమ ఆధారిత అప్‌స్కిల్లింగ్ ఇవ్వాలి. ఆరోది.. విద్యార్థులకు నిజమైన ఇంటర్న్‌షిప్ అనుభవం కల్పించాలి. ఏడోది.. కోర్సు పూర్తయ్యే సమయానికి ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యం ఉండేలా చూడాలి. ఎనిమిదోది.. జపాన్ వంటి దేశాలతో విద్యా భాగస్వామ్యాలను విస్తరించాలి. ఇక్కడే విద్యార్థుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, అంతర్జాతీయ శిక్షణ, జపనీస్ భాష, సాంస్కృతిక అవగాహన, పరిశ్రమ అనుసంధానం కీలకమవుతాయి. తెలంగాణ విద్యార్థులు జపాన్ సాంకేతిక విద్యాసంస్థల్లో శిక్షణ పొందాలి. జపాన్ విద్యార్థులు తెలంగాణ విద్యాసంస్థలను సందర్శించాలి. అధ్యాపకులకు పరస్పర శిక్షణ ఉండాలి. సంయుక్త ప్రాజెక్టులు చేపట్టాలి. పరిశ్రమలతో కలిసి శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలి. ఆ తర్వాత ఆ శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించాలి. జపాన్‌లో ఉపాధి కోసం వెళ్లే తెలంగాణ యువకుడికి కేవలం సాంకేతిక నైపుణ్యం సరిపోదు. టెక్నికల్ స్కిల్, జపనీస్ భాష, పని సంస్కృతి, క్రమశిక్షణ, పరిశ్రమ అనుభవం, ఉద్యోగ అనుసంధానం. ఈ ఆరు అంశాలు కలిసినప్పుడే అంతర్జాతీయ ఉపాధికి బలమైన మార్గం ఏర్పడుతుంది. జపాన్ కథలో అత్యంత ముఖ్యమైన అంశం భవనాలు కాదు. ప్రయోగశాలలు కాదు. యంత్రాలు కాదు. విద్యను చూసే దృక్పథంలో వచ్చిన మార్పు. మన తెలంగాణలో కూడా పరీక్షల్లో మంచి మార్కులు రావాలి అన్నదానితో పాటు.. నేను ఏం చేయగలను? ఏ సమస్యను పరిష్కరించగలను? ఏ యంత్రాన్ని నిర్వహించగలను? ఏ పరిశ్రమలో పని చేయగలను? ప్రపంచ స్థాయిలో నా నైపుణ్యానికి ఎంత విలువ ఉంది? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగేలా విద్యార్థిని తీర్చిదిద్దే వ్యవస్థ ప్రారంభం కావాలి. అదే జపాన్ విద్యా వ్యవస్థ పరిణామం నుంచి కనిపించే అసలు సారాంశం. తెలంగాణలో యువ జనాభా ఎక్కువగా ఉంది. పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉంది. హైదరాబాద్ అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా ఎదిగింది. ఫార్మా, ఐటీ, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, తయారీ వంటి అనేక రంగాల్లో అవకాశాలున్నాయి. ఇప్పుడు ఈ అవకాశాలకు తగిన మానవ వనరులను తయారు చేయాల్సి ఉంది. అందుకే స్కిల్లింగ్‌ను కేవలం ఉద్యోగం కోసం ఒక శిక్షణ కార్యక్రమంగా చూడకూడదు. అది రాష్ట్ర ఆర్థిక విధానంలో భాగం కావాలి. పరిశ్రమల ఆకర్షణలో భాగం కావాలి. యువత భవిష్యత్తులో పెట్టుబడిగా మారాలి. జపాన్ గత అనుభవం ఈ విషయాన్ని నిరూపించింది.

విద్యను దేశ అవసరాలకు అనుగుణంగా మార్చితే.. విద్యార్థి మారుతాడు. విద్యార్థి మారితే.. పరిశ్రమ మారుతుంది. పరిశ్రమ మారితే.. ఆర్థిక వ్యవస్థ మారుతుంది. అయితే ఈ ప్రయాణం ఒక్క దశలో పూర్తికాదు. జపాన్ కూడా నేటికీ తన విద్యా, నైపుణ్య వ్యవస్థను కొత్త సవాళ్లకు అనుగుణంగా మార్చుకుంటూనే ఉంది. అందుకే తెలంగాణకు జపాన్ నుంచి నేర్చుకోవాల్సింది ఒకే విధమైన నమూనా కాదు.. మార్పును స్వీకరించే విద్యా సంస్కృతి. తరగతి గదిలో జ్ఞానం ఉండాలి. ప్రయోగశాలలో చేతికి పని రావాలి. పరిశ్రమలో అనుభవం రావాలి. ప్రపంచ మార్కెట్‌లో ఆ నైపుణ్యానికి విలువ రావాలి. అప్పుడే యువత మన దేశానికైనా, మన రాష్ట్రానికైనా ఆస్తిగా మారుతుంది. అప్పుడే స్కిల్ తెలంగాణ ఒక నినాదం కాకుండా.. పరిశ్రమలు కోరుకునే మానవ వనరుల కేంద్రంగా రాష్ట్రాన్ని నిలబెడుతుంది. ఉద్యోగం కోసం విద్యనా?.. ఉద్యోగాన్ని సృష్టించే నైపుణ్యం కోసం విద్యనా? ఈ రెండింటి మధ్య తేడాను స్పష్టంగా చూపించే దేశం జపాన్. సాంకేతిక విద్యను కేవలం సర్టిఫికెట్ ఇచ్చే వ్యవస్థగా కాకుండా.. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసే వ్యవస్థగా జపాన్ తీర్చిదిద్దింది. విద్యాసంస్థ-పరిశ్రమ-విద్యార్థి మధ్య బలమైన అనుసంధానం అక్కడి స్కిల్లింగ్ మోడల్‌కు ప్రధాన బలం. జపాన్ అభివృద్ధి కథలో విద్య ఒక భాగం కాదు.. అభివృద్ధికి పునాది వేసిన శక్తుల్లో ఒకటి. తెలంగాణ కూడా ఆ పాఠాన్ని తన అవసరాలకు తగ్గట్టుగా ఆచరణలోకి తీసుకురావాల్సిన సమయం ఇదే.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919.
Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.